

ఇదీ.. మా గోడు..!

వెళ్లి కేంద్రానికి చెప్పండి..!

సాయం చేయకుంటే సేద్యం చేయలేం
పంట సాగుచేస్తే పెట్టుబడీ రావడం లేదు
పశువులకు గడ్డిలేక పాల దిగుబడి తగ్గింది
ఉపాధి పనిదినాలు సరిపోక వలస వెళుతున్నాం
కేంద్ర బృందం ఎదుట అన్నదాతలు, కూలీల ఆవేదన
ఉరవకొండ, కణేకల్లు మండలాల్లో పర్యటించిన బృందం



కేంద్ర కరువు బృందానికి సమస్యలను వివరిస్తున్న రైతు నాగభూషణం



ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న కరువు బృందం సభ్యులు

ఏ పంట పెట్టినా నష్టమే. వర్షాలే లేవు. పెట్టుబడులు కూడా తిరిగి రావడం లేదు. ప్రభుత్వ పథకాలు సరిగా అందడం లేదు. ఉపాధి పని దినాలు కూడా సరిపోవడం లేదు. నలుగురైదుగురు ఉన్న కుటుంబాలకు వంద రోజుల పనిదినాలు కేటాయించారు. ఆ తరువాత పనులు ఇవ్వడంలేదు. దూర ప్రాంతాలకు వలస వెళ్లి పనులు వెతుక్కుంటున్నాం. పంటలు లేవు.. పశుగ్రాసం లేదు. ప్రభుత్వం ఇచ్చే దాణామృతంలో నాణ్యత లేదు. గడ్డి, దాణామృతాన్ని బయట కొనాల్సి వస్తోంది. పాల దిగుబడి గణనీయంగా తగ్గింది. తాగునీటికి బోర్లు వేస్తే ఉప్పునీరు వస్తోంది. కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మమ్మల్ని ఆదుకోండి..

ఇదీ.. జిల్లా రైతుల గోడు. కేంద్రం నుంచి వచ్చిన ఇంటర్ మినిస్టీరియల్ బృందం ఎదుట కష్టాలను ఏకరువు పెట్టారు. వ్యవసాయం, పాడి పరిశ్రమ ఎంతటి సంక్షోభంలో ఉన్నాయో కళ్లకు కట్టారు. ప్రభుత్వ సాయం అందకపోతే వ్యవసాయం చేయలేమని నిస్సహాయత వ్యక్తం చేశారు. రైతుల ఆవేదనను జిల్లా అధికారులు కేంద్ర బృందానికి వివరించారు. ఇక్కడి పరిస్థితులను కేంద్రానికి నివేదిస్తామని కరువు బృందం రైతులకు తెలిపింది.



సమావేశానికి హాజరైన కేంద్ర బృందం సభ్యులు, జేసీ



ఎమ్మెల్యే కాలవ తరపున వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

ఉరవకొండ/కణేకల్లు, జూన్ 20: వర్షాభావం కారణంగా గత ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన ప్రధాన పంట పప్పుశనగ సహా అన్ని పంటలు దెబ్బతిన్నాయని, పూర్తిగా నష్టపోయామని కేంద్ర కరువు బృందానికి జిల్లా రైతులు తెలియజేశారు. ఉరవకొండ మండలం పెద్ద కౌకుంట్ల, కణేకల్లు మండలం సొల్లాపురం గ్రామాల్లో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ రితేష్ చౌహాన్ నేతృత్వంలోని పొన్నుస్వామి, సునీల్ దూబే బృందం గురువారం పర్యటించింది. పెద్ద కౌకుంట్లలో వ్యవసాయశాఖ అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించింది. రబీలో జరిగిన పంటనష్టాన్ని కళ్లకు కట్టే ఫొటోలను కేంద్ర బృందానికి జిల్లా అధికారులు చూపించారు. అనంతరం స్థానిక రైతులతో కేంద్ర బృందం మాట్లాడింది.

క్షేత్రస్థాయి పరిశీలన..

ఉరవకొండ మండలం నింబగల్లులోని సమ్మర్ స్టోరేజ్ వాటర్ ట్యాంక్‌ను కేంద్ర బృందం పరిశీలించింది. వర్షాభావంలో నీటి లభ్యత లేకపోవడంతో మూడు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లు ఎండిపోయాయని స్థానిక అధికారులు వారికి వివరించారు. అక్కడి నుంచి కణేకల్లు మండలం సొల్లాపురానికి చేరుకుని, పప్పుశనగ పంట నష్టంపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర బృందం పరిశీలించింది. అనంతరం అక్కడి రైతులతో మాట్లాడింది. గత ఏడాది వర్షాభావంతో పప్పుశనగ పంట పూర్తిగా ఎండిపోయిందని రైతులు నాగభూషణం, బుచ్చిరెడ్డి, మల్లికార్జున కేంద్ర కరువు బృందం సభ్యుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. పంటనష్ట పరిహారం అందించి ఆదుకోవాలని విన్నవించారు.



నింబగల్లు వద్ద సమ్మర్ స్టోరేజీ వాటర్ ట్యాంక్ పరిశీలన

ఇదేం తీరు..?

కేంద్ర బృందం పర్యటనపై గందరగోళం
అర్ధరాత్రి షెడ్యూల్ మార్చిన అధికారులు

అనంతపురం అర్బన్, జూన్ 20: కేంద్ర కరువు బృందం పర్యటన విషయంలో జిల్లా అధికారుల తీరు గందరగోళానికి దారితీసింది. విడపనకల్లు మండలం మాళాపురం, వజ్రకరూరు మండలం గూళ్యపాల్యం గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటిస్తుందని జిల్లా వ్యవసాయ శాఖ యంత్రాంగం షెడ్యూల్ విడుదల చేసింది. దీంతో అక్కడి అధికారులు ఏర్పాట్లు చేసుకున్నారు. ఆ తర్వాత బుధవారం అర్ధరాత్రి ఉన్నట్లుండి షెడ్యూల్‌కు మార్చేశారు. ఉరవకొండ మండలం పెద్ద కౌకుంట్ల, కణేకల్లు మండలం సొల్లాపురం గ్రామాల్లో పర్యటించేలా మార్పులు చేశారు. ఈ విషయాన్ని గురువారం తెల్లవారుజామున ఆయా మండలాల అధికారులకు ఫోన్ చేసి తెలియజేశారు. కొందరికి వాట్సాప్ గ్రూపుల్లో సమాచారం ఇచ్చారు. షెడ్యూల్ మారడంతో ఉరవకొండ, కణేకల్లు మండలాల అధికారులు ఉరుకులు పరుగులు పెట్టాల్సి వచ్చింది. కేంద్ర బృందం వచ్చేలోగా రైతులతో ముఖాముఖి, పంటనష్టం ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసేందుకు తంటాలు పడ్డారు. కేంద్ర కరువు బృందం జిల్లా పర్యటన నేపథ్యంలో వారం రోజులుగా జిల్లా ఉన్నతాధికారులు సమాలోచనలు జరిపారు. తీరా వారు వచ్చాక గందరగోళం సృష్టించారు. షెడ్యూల్ మారిన విషయాన్ని మీడియాకు కూడా సకాలంలో తెలియజేయలేదు. సమాచార శాఖ వాట్సాప్ గ్రూప్‌లో గురువారం ఉదయం 10 గంటలకు నింపాదిగా విషయాన్ని తెలియజేశారు. అధికారుల తీరుపై రైతు సంఘాల నాయకులు, రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

వ్యవసాయం చేయలేం..



రబీలో 1.50 ఎకరాలలో పప్పుశనగ పంట సాగు చేశాను. వర్షాభావం, తెగుళ్లతో పంట పూర్తిగా దెబ్బతింది. వర్షం వచ్చి ఉంటే ఎకరానికి ఎనిమిది క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. 20 కేజీల దిగుబడి కూడా రాలేదు. ఎకరానికి రూ.15 వేల దాకా పెట్టుబడి పెట్టాం. తీవ్రంగా నష్టపోయాము. మమ్మల్ని ఆదుకోకపోతే వ్యవసాయం చేయలేము. పప్పుశనగకు ఫసల్ బీమాను వర్తింపజేయాలి. మద్దతు ధరను పెంచాలి. పశుగ్రాసం లేక ఇబ్బంది పడుతున్నాం. ట్రాక్టర్ గడ్డిని రూ.10 వేలకు కొనుగోలు చేశాం. పశు పోషణ కూడా భారంగా మారింది.

- రామాంజనేయులు, కౌకుంట్ల

కేంద్రానికి చెప్పండి..

కరువు పరిస్థితుల కారణంగా తాగునీరు, పశుగ్రాసానికి ఇబ్బందులు పడుతున్నాం. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి. కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మమ్మల్ని ఆదుకోవాలి. పశుగ్రాసం దొరక్క పాడి దాగుబడి తగ్గుతోంది. రెండు కేజీల వరిగడ్డి రూ.30కు కొంటున్నాము. నాణ్యత లేని దాణామృతం ఇస్తున్నారు. దీంతో పశువులు తినడం లేదు.

- కృష్ణారెడ్డి, కౌకుంట్ల

రూ.50 వేలు నష్టపోయా..

నాకు 3.65 ఎకరాల పొలం ఉంది. అందులో పప్పుశనగ సాగు చేశాను. ఎకరానికి రూ.20 వేల వరకూ పెట్టుబడి ఖర్చు వచ్చింది. వర్షాలు లేనికారణంగా దిగుబడి కేవలం 50 కేజీలు వచ్చింది. వాటిని విక్రయిస్తే రూ.2500 చేతికొచ్చింది. వ్యవసాయం చేసినందుకు ఒక్క రబీ సీజన్‌లోనే రూ.50 వేలు నష్టపోయాను. దాన్ని ఎలా పూడ్చుకోవాలి..?

- నాగభూషణం, సొల్లాపురం

పని దినాలను పెంచాలి..

మా ఇంట్లో నలుగురం ఉపాధి పనులకు వెళుతున్నాం. మా జాబ్‌కార్డుకు కేటాయించిన వంద రోజుల పని దినాలు త్వరగా పూర్తయ్యాయి. ఇంకా పనులు చేయాలని ఉన్నా వంద రోజులు ముగియడంతో పిలవడం లేదు. దీంతో పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. మాలాంటి కుటుంబాలకు పని దినాలు పెంచాలి.

- సత్తార్, సొల్లాపురం

పాడి రైతులను ఆదుకోవాలి..



పశుగ్రాసం దొరక్క పాల దిగుబడి తగ్గుతోంది. పాలను తక్కువ ధరకే ప్రైవేట్ డైరీలకు విక్రయిస్తున్నాం. దాణా నాణ్యత లేక పశువులు తినడం లేదు. గతంలో మొక్క జొన్నతో దాణా తయారు చేసేవారు. కానీ ఇప్పుడు అలా చేయడం లేదు. దీంతో మార్కెట్‌లో దాణా కొనాల్సి వస్తోంది. పశుగ్రాసం కొరతను తీర్చాలి. గడ్డి విత్తనాలను సబ్సిడీతో ఇవ్వాలి. మాకు ప్రభుత్వ సాయం అందడం లేదు.

-ఆంజనేయులు, కౌకుంట్ల

ఎమ్మెల్యేల తరఫున వినతిపత్రాలు

కణేకల్లు మండలం సొల్లాపురం గ్రామానికి వచ్చిన కరువు బృందానికి రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తరఫున టీడీపీ నాయకులు కోశకుర్తి సుదర్శన్, శరభనగౌడ్, వెంకటేచౌదరి వినతిపత్రం అందజేశారు. జిల్లా రైతులు ఏటా కరువుకాటకాలతో అల్లాడిపోతున్నారని, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదుకోవాలని కోరారు. అతి తక్కువ వర్షపాతం నమోదయ్యే ఈ జిల్లాలో రైతులకు పెట్టుబడులు కూడా తిరిగి రావడం లేదని అన్నారు. ఇక్కడి ప్రజలను ఆదుకునేందుకు విరివిగా నిధులు మంజూరు చేయించాలని కోరారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తరఫున ఆయన కుమారుడు యశ్వంత్ నియోజకవర్గ సమస్యలను కరువు బృందానికి వివరించారు.

తాగునీరు ఇవ్వండి..

మా ప్రాంతమంతా నల్లరేగడి భూములే ఉన్నాయి. బోర్లు వేస్తే కేవలం ఉప్పునీరు వస్తోంది. తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. తాగునీటి సమస్యకు పరిష్కారం చూపించండి.

- మల్లికార్జున, సొల్లాపురం

నివేదికలు తయారు చేస్తాం..

కరువు బృందం పర్యటిస్తున్న ప్రాంతంలో రైతులు మా దృష్టికి తీసుకొస్తున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు నివేదికలు తయారు చేస్తున్నాం. రైతులు చెబుతున్న అంశాలను నమోదు చేసుకుని.. కరువు బృందానికి వివరించి, పరిష్కార మార్గలను కూడా చెబుతున్నాం.

- కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్

పాలనలో రెవెన్యూ ఉద్యోగులే కీలకం

రెవెన్యూ దినోత్సవంలో కలెక్టరు వినోద్ కుమార్



కలెక్టరు వినోద్ కుమార్‌తో రెవెన్యూ ఉద్యోగులు

అనంతపురం టౌన్, జూన్ 20: పరిపాలనలో రెవెన్యూ ఉద్యోగుల పాత్ర చాలా కీలకమని కలెక్టరు వినోద్ కుమార్ కొనియాడారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో గురువారం రాత్రి రెవెన్యూ దినోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టరు మాట్లాడుతూ.. కలెక్టరు, జాయింట్ కలెక్టరు, సబ్ కలెక్టర్లు, డీఆర్‌ఓలు ఇలా అందరూ రెవెన్యూశాఖ నుంచే శిక్షణ పొంది వచ్చినవారమేనన్నారు. రెవెన్యూ శాఖ అన్నిశాఖలకు తల్లిలాంటిదని అభివర్ణించారు. ఏ కష్టం మొచ్చినా రెవెన్యూశాఖ ముందుండి భరోసా ఇస్తుందన్నారు. అలాంటిశాఖలో ఉద్యోగం చేయడం అదృష్టమని, ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేసి శాఖకు మరింత మంచి పేరు తీసుకురావాలని కలెక్టరు సూచించారు. ఈ సందర్భంగా పలువురు రెవెన్యూ అధికారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జేసీ కేతన్‌గార్గ్, నగరపాలక కమిషనర్ మేఘస్వరూప్, డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, ఆర్డీఓలు రాణిసుష్మిత, గ్రంధి వెంకటేష్, శ్రీనివాసులురెడ్డి, డీపీఎం ఆనంద్, కలెక్టరేట్ ఉద్యోగులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

కాళ్లున్నా.. వైకల్యమట..!

వైసీపీవారికి దొడ్డిదారిన పింఛన్లు



వికలాంగుడు అంటూ పింఛన్ పొందుతున్న చాకలి ఎర్రిస్వామి.. పింఛన్ మంజూరు అయిన సర్టిఫికెట్

పింఛన్ కోసం వైసీపీ వర్గీయులు అడ్డదారిని ఎంచుకున్నారు. దొడ్డిదారిన పీహెచ్ సర్టిఫికెట్ తెచ్చుకుని.. నెల నెలా అప్పనంగా రూ.3 వేలు పింఛన్ తీసుకుంటున్నారు. విడపనకల్లు మండలంలోని చీకలగురికి గ్రామానికి చెందిన ఇద్దరు వైసీపీ వర్గీయులు కర్నూలు జిల్లా ఆదోనిలో ఓ ఆర్థో డాక్టర్ వద్దకు వైకల్యం ఉన్నట్లు 2023లో సర్టిఫికెట్ తెచ్చుకున్నారు. ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.30 వేలు చెల్లించారని సమాచారం. కొత్తపల్లి ఎర్రిస్వామి అనే వ్యక్తికి ఎలాంటి వైకల్యం లేదు. గ్రామంలో చక్కగా తిరుగుతున్నాడు. కానీ 40 శాతం వైకల్యం ఉన్నట్లు చూపించి.. దివ్యాంగుల కోటాలో (ఐడీ నంబరు 11200207155) నెల నెలా రూ.3 వేలు పింఛన్ పొందుతున్నాడు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చే రూ.6 వేల పింఛన్ అందుకునేందుకు సిద్ధమయ్యాడు. చాకలి ఎర్రిస్వామి అనే వ్యక్తికి కూడా వైకల్యం లేదు. కానీ 57 శాతం వైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్ సంపాదించారు. ఐడీ నంబరు 11200203956 కింద నెల నెలా రూ.3వేలు పింఛన్ తీసుకుంటున్నాడు. ఈయన కూడా కొత్త పింఛన్ కోసం ఆత్రంగా ఎదురు చూస్తున్నాడు. మోకాలి నొప్పితో బాధపడే వ్యక్తికి ఏకంగా కాలు లేనట్లు వైద్యులు సర్టిఫికెట్ ఇవ్వడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. అక్రమంగా పింఛన్ పొందుతున్నవారిపై అధికారులకు ఫిర్యాదు చేస్తామని సర్పంచ్ కొత్తపల్లి ఎర్రెమ్మ తెలిపారు.

- విడపనకల్లు

ఇద్దరూ ఇద్దరే..!

నగరపాలికలో కమీషన్ల పర్వం
పనులు చేయరు.. పద్ధతి మార్చుకోరు
ఫైల్స్ కదలాలంటే చేయి తడపాల్సిందే
కమిషనర్ చేతికి వారి 'అవినీతి' నివేదిక
సరెండర్‌కు ఆదేశం.. ఎన్నికల కోడ్‌తో బ్రేక్



అనంతపురం క్రైం, జూన్ 20: అనంత నగరపాలిక ఇంజనీరింగ్ విభాగంలో ఇద్దరు మహిళా అధికారుల తీరు వివాదాస్పదంగా మారింది. విధి నిర్వహణలో వారి తీరు ఉన్నతాధికారులకు తలనొప్పి తెప్పిస్తోందట. బుద్ధిగా వేతనం తీసుకుని.. వచ్చిన ఫైళ్లను పరిశీలించి పై అధికారులకు ఫార్వర్డ్ చేయడం కూడా వారికి చేతకాదని అంటున్నారు. అయినా.. కమీషన్‌లు మాత్రం తప్పనిసరిగా ఇవ్వాల్సిందేనట. పనుల విషయంలో అంచనాలను తక్కువ ధరకు కోట్ చేసి పంపుతారని విమర్శలు వస్తున్నాయి. ఇద్దరికీ ఒకరంటే ఒకరికి పొసగదని, ఏ పని అప్పగించినా తాము చూడలేదు.. చేయలేదు అంటూ నేరుగా ఫైల్‌లో నోట్ చేస్తారని కొందరు కాంట్రాక్టర్లు వాపోతున్నారు. వీరి తీరు కారణంగా కాంట్రాక్టర్లకు ఈఈ సమాధానం చెప్పుకోలేక.. ఇన్‌చార్జ్ ఎస్ఈకి నోట్ రూపంలో ఫిర్యాదు చేశారు. ఆ నోట్ ఆధారంగా ఇన్‌చార్జ్ ఎస్ఈ లోతుగా విచారించారు. గతంలో వారు చేసిన అవినీతి వ్యవహారాలను జోడించి.. కమిషనర్‌కు నివేదిక ఇచ్చారు. ఆ నివేదికను చూసిన కమిషనర్.. 'ఇలాంటి వాళ్లు మనకెందుకు..?' అంటూ సరెండర్ చేసేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. కానీ అదే సమయంలోనే ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రక్రియకు బ్రేక్ పడింది. ప్రభుత్వం మారడంతో ఇక మునుముందు ఏం జరుగుతుందోనన్న చర్చ మొదలైంది.

జీతం చాల్లేదేమో..

ప్రభుత్వం ప్రతి నెలా ఇచ్చే వేల రూపాయల వేతనం వారికి సరిపోవడం లేదు. అవినీతికి తెరలేపారు. నగరపాలికలో డీఈ, ఏఈ ఉద్యోగాలను వెలగబెడుతూ.. ఒక శాతం, రెండు శాతం కమీషన్లు వసూలు చేస్తున్నారని సమాచారం. 'కమీషన్ ఇవ్వం.. మళ్లీ ఇస్తాం' అని ఎవరైనా అంటే కుదరదట. ఫైల్‌పై సంతకం పెట్టాలంటే ముందు కమీషన్ చేతికందాల్సిందే అని అంటున్నారు. కాంట్రాక్టర్ల నుంచి వచ్చే ప్రతి ఫైల్‌కూ ఆ ఇద్దరూ కమీషన్ ముక్కుపిండి వసూలు చేస్తున్నారని సమాచారం. కమీషన్ ఇచ్చినా.. ఫైల్స్‌పై త్వరగా సంతకాలు చేయరట. వారికి ఇష్టం వచ్చినప్పుడే సంతకాలు చేసి పై అధికారులకు పంపుతారని సమాచారం. కమీషన్ల విషయంలో పోటీపడే వీరు.. కలిసిమెలిసి పని చేస్తారా అంటే.. అదీ లేదు. ఎడ్డెమంటే తెడ్డెం అంటారని బాధిత కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

అన్నీ ఆటంకాలే..

ఆ ఇద్దరు ఇంజనీర్ల కారణంగా నగరపాలికలో పనులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని ఇంజనీరింగ్ సిబ్బంది వాపోతున్నారు. ఏదైనా వర్క్ ఫైల్ వెళితే సరిగా స్పందించరట. ఆ ఫైల్, ఆ వర్క్ తమకు సంబంధం లేదు అంటారట. చూడలేదు, చేయలేదు అని నోట్ రాస్తారట. దీంతో ఆ ఫైల్ తిరిగి కిందికి వస్తోందని ఈఈ దృష్టికి తీసుకెళ్తున్నారు. కొన్ని సార్లు చెప్పి చూశారు. కానీ వారిలో మార్పు రాలేదు. మూడు నెలల క్రితం ఆరు కంప్యూటర్లు కావాలని టెండరు పిలిచారట. కానీ మార్కెట్ ధరకంటే తక్కువ ధరకు కోట్ చేశారట. కనీసం రూ.30 వేలు విలువ చేసే కంప్యూటర్లకు రూ.23 వేలు, రూ.25 వేలు ఎస్టిమేషన్ వేసినట్లు సమాచారం. దీంతో పలు మార్లు టెండర్ పిలిచినా ఏ ఒక్క కాంట్రాక్టరూ ముందుకు రాలేదని సమాచారం. ప్రతి టెండరు విషయంలోనూ ఇలాగే వ్యవహరిస్తారని ప్రచారం జరుగుతోంది. మహనీయుల జయంతి, వర్ధంతి సందర్భాల్లో విగ్రహాలకు వినియోగించే పూల మాలలు, అలంకరణకు రూ.30 వేల నుంచి రూ.35 వేల ఖర్చు కావచ్చని చెబితే.. రూ.2 వేల నుంచి బేరం మొదలు పెట్టి రూ.5 వేలకు పూర్తి చేయొచ్చుగా అంటారట. దీంతో కాంట్రాక్టర్లు టెండరు వద్దే వద్దని పారిపోతున్నారని సమాచారం.

బదిలీనా...? సరెండరా...?

ఇంజనీరింగ్ పనులు, టెండర్ల విషయంలో ఆ ఇద్దరి తీరుతో విసిగిపోయిన ఈఈ.. కాంట్రాక్టర్లకు సమాధానం చెప్పలేక.. ఇన్‌చార్జ్ ఎస్ఈ రామ్మోహన్‌రెడ్డికి లేఖ రాశారు. ఆ లేఖకు స్పందించిన ఎస్ఈ.. కర్నూలు జిల్లా డోన్ మున్సిపాలిటీలో, అహుడాలో జరిగిన అవినీతి వ్యవహారాలను జోడించి.. నోట్ సిద్ధం చేరు. నివేదికను కమిషనర్ మేఘ స్వరూప్‌కు పంపారు. ఆ వివరాలు చూసిన కమిషనర్.. సరెండర్‌కు ఆదేశాలిచ్చారని తెలిసింది. అదే సమయంలోనే ఎన్నికల కోడ్ రావడంతో వారి సరెండర్‌కు బ్రేక్ పడింది. ఎన్నికలు ముగిశాయి..! ఇకపై ఏమిటి అన్న చర్చ జరుగుతోంది.

చెరువును అమ్మేశాడు..!

వైసీపీ ప్రజాప్రతినిధి బరితెగింపు.. అక్రమ లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణం



చెరువు స్థలంలో కట్టిన షెడ్



చెరువు స్థలంలో కట్టిన ఇళ్లు

అనంతపురం రూరల్, జూన్ 20: అధికారంలో ఉన్నాం కదా అని వైసీపీ వారు గడిచిన ఐదేళ్లు బరితెగించి వ్యవహారాలు నడిపారు. అక్రమ సంపాదన కోసం అడ్డమైన పనులన్నీ చేశారు. అనంతపురం రూరల్ మండలంలో ఓ ప్రజాప్రతినిధి అక్రమ లే అవుట్ వేయడంతోపాటు.. చెరువు స్థలాన్ని కబ్జా చేసి మరీ అమ్మేశాడు. జిల్లా కేంద్రానికి అత్యంత సమీపంలోని రాచానపల్లిలో ఈ వ్యవహారం నడుస్తోంది. సర్వే నంబరు 171లో రాచానపల్లి చెరువు ఉంది. ఆ చెరువకు ఆనుకుని వైసీపీ ప్రజాప్రతినిధి ఒకరు లే అవుట్ వేశారు. అదికూడా అనధికారిక లే అవుటే. ఇది చాలదన్నట్లు లే అవుట్‌కు ఆనుకుని ఉన్న ఎకరం చెరువు స్థలాన్ని ఆక్రమించాడు. ప్లాట్లు వేసి అమ్మేశాడు. కొన్నవారిలో కొందరు షెడ్లు వేశారు. ఒకరిద్దరు ఓ మాదిరి ఇళ్లను నిర్మించుకున్నారు. ఇంకొందరు బండలు పాతుకుని హద్దు వేసుకున్నారు. ఆ ప్రాంతంలో సెంటు స్థలం ఐదారు లక్షలు పలుకుతోంది. దీంతో వైసీపీ ప్రజాప్రతినిధికా బాగానే గిట్టుబాటు అయింది. చెరువును ఆక్రమించి ఇళ్లను నిర్మిస్తున్నట్లు అధికారుల దృష్టికి వెళ్లింది. అక్కడికి వెళ్లి ఇళ్ల నిర్మాణాలను నిలిపివేయాలని హెచ్చరించారు. కానీ అప్పట్లో వైసీపీ అధికారంలో ఉండటం, ఆక్రమించిన వ్యక్తి ఆ పార్టీ ప్రజాప్రతినిధి కావడంతో చర్యలు తీసుకోలేదు. ఈ క్రమంలో నిర్మాణాల జోరు మరింత పెరిగింది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని.. లేదంటే చెరువు మాయమౌతుందని స్థానికులు అంటున్నారు.

నిలిపివేయాలని చెప్పాం..

చెరువు స్థలాన్ని ఆక్రమించి ఇళ్ల నిర్మాణం చేపట్టిన విషయం మా దృష్టికి వచ్చింది. అక్కడికి వెళ్లి పరిశీలించాం. చెరువు స్థలంలో నిర్మాణాలను నిలిపివేయాలని హెచ్చరించాము. మళ్లీ నోటీసులు జారీ చేస్తున్నాం. అక్రమంగా నిర్మాణాలు చేపట్టేవారిపై చర్యలు తీసుకుంటాం.

-కృష్ణకుమార్, ఏఈ, ఇరిగేషన్

అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా

బీసీ, ఆర్థిక బలహీన వర్గాల సంక్షేమ, చేనేత-జౌళి శాఖ మంత్రి సవిత

బాధ్యతల స్వీకరణ



మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న సవిత

పుట్టపర్తి, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని రాష్ట్ర బీసీ సంక్షేమ, ఆర్థిక బలహీనవర్గాల సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత అన్నారు. గురువారం అమరావతిలోని సచివాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. వెనుకబడిన తరగతుల్లోని విద్యార్థులు, నిరుద్యోగులకు ఉచిత డీఎస్సీ అందించే కోచింగ్‌ఫైల్‌పై తొలి సంతకం చేశారు. ఎన్టీఆర్ విదేశీ విద్యపై రెండో సంతకం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వెనబడిన తరగతుల సంక్షేమం కోసం త్వరలో బీసీ కమిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. చేనేత, హస్త కళాకారులకు తగిన రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. చేనేత వస్త్ర రంగాలను అన్ని విధాలా అందుకుంటామన్నారు. వారానికి ఒక్కసారైనా సచివాలయ ఉద్యోగులు, ప్రజలు చేనేత వస్త్రాలు ధరించాలని కోరారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన మంత్రి సవితకు కళ్యాణదుర్గం, మడకశిర ఎమ్మెల్యేలు అలిమినేని సురేంద్రబాబు, ఎంఎస్ రాజు, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల టీడీపీ అధ్యక్షులు వడ్డె అంజినప్ప, వెంకటశివుడు యాదవ్, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అనంతరాము, పరిశ్రమలు, చేనేత వస్త్ర శాఖల ప్రిన్సిపాల్ సెక్రటరీ సునీతతోపాటు జిల్లాలోని పలువురు టీడీపీ నేతలు.. మంత్రికి అభినందనలు తెలిపారు.



పూజలు చేస్తున్న సవిత

జోరుగా మిరప విత్తన జీరో వ్యాపారం

అనధికారికంగా వెలసిన షాపులు

పట్టించుకోని అధికారులు

ప్రభుత్వ ఆదాయానికి రూ.కోట్లలో గండి

విడపనకల్లు, జూన్ 20: మండలకేంద్రంలో మిరప విత్తన జీరో వ్యాపారం జోరుగా సాగుతోంది. అనధికార మిరప విత్తన విక్రయ కేంద్రాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. ఏదైనా విత్తనాన్ని విక్రయించాలి అంటే ముందుగా ప్రభుత్వం అనుమతులు పొందాలి. విక్రయ లైసెన్స్ కలిగి ఉండాలి. అయితే విడపనకల్లు మండలంలో వైసీపీ నాయకులు బరితెగించి ఎటువంటి అనుమతులు లేకుండా మిరప విత్తన విక్రయ షాపులను ప్రారంభిస్తున్నారు. ఇక్కడ మిరప విత్తన కొనుగోలు చేసేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్నూలు జిల్లా, కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చి వారికి కావాల్సిన విత్తనాన్ని రైతులు తీసుకెళ్తుంటారు. ఒక్కో వ్యాపారి రోజుకు వంద క్వింటాళ్లకుపైగా వ్యాపారం చేస్తుంటాడు. అంటే ఈ లెక్కన ప్రభుత్వ ఆదాయానికి రోజుకు ఎంత గండిపడుతోందో ఇట్టే అర్థమైపోతోంది. డబ్బి రకం క్వింటాలు రూ.34వేల నుంచి 38వేలు, కడ్డీ రకం క్వింటం రూ.18వేల నుంచి 20 వేలకు విక్రయిస్తున్నారు. మండల కేంద్రంలో రోజూ వివిధ ప్రాంతాల రైతులు కొనుగోలుకు వస్తుండటంతో సందడి వాతావరణం నెలకొంటోంది. విత్తనాలు విక్రయిస్తే అధికారులు దాడులు చేస్తారని ఆలోచించి తెలివిగా వ్యాపారులు మిరపకాయలను రైతులకు కేజీల ప్రకారం విక్రయిస్తున్నారు. అక్కడ వాళ్ల ఏర్పాటు చేసుకున్న మిషన్లలో మిరపకాయలను ఆడించి విత్తనాన్ని విక్రయిస్తున్నారు. మిరపకాయలు ఆడించే మిషన్లకు కూడా ఎటువంటి అనుమతులు లేకుండా స్థానిక బస్టాండ్ ప్రాంతంలో బహిరంగంగా ఏర్పాటు చేసి విత్తనాలను అమ్ముతున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో దాదాపుగా మిరప విక్రయ షాపులు వందకుపైగా వెలిశాయి. రోజూ కోట్లలో వ్యాపారం చేస్తూ ప్రభుత్వానికి ఎటువంటి ట్యాక్స్‌లు చెల్లించకుండా జోరుగా జీరో వ్యాపారం చేస్తున్నా మండలంలో ఏ ఒక్క అధికారి పట్టించుకోవటం లేదు. రైతులు కొనుగోలు చేసే విత్తనానికి ఎటు వంటి రసీదులు ఉండవు. లక్షల్లో పెట్టుబడులు పెట్టి విత్తనాన్ని కొనుగోలు చేసిన రైతులకు ఆ విత్తనం పెయిలూర్ అయితే ఇక అంతే ఎవరిని అడగాలో తెలియని పరిస్థితి నెలకొంటుంది. ఈ నేపథ్యంలో అనధికారికంగా వెలసిన మిరప విత్తన కేంద్రాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



అనుమతులు లేకుండా వెలసిన మిరప విత్తన విక్రయ షాపు



నమూనా విత్తనాలు



షాపులో సిద్ధంగా ఉన్న వివిధ రకాల విత్తనాలు

మా పరిధిలోకి రాదు

అనుమతులు లేని మిరపకాయలు విక్రయించే షాపులు ఉన్న విషయం తెలిసింది. అయితే వ్యాపారులు తెలివిగా విత్తనాన్ని విక్రయించకుండా ఎండు మిరపకాయలు విక్రయిస్తున్నారు. వ్యాపారులే వారి మిషన్లకు మిరపకాయలు ఆడించి విత్తనాన్ని రైతులకు ఇచ్చి పంపుతున్నారు. రైతులు కొనుగోళ్లు చేస్తున్నా విత్తనానికి ఎటువంటి రసీదులు ఉండటంలేదు. ఏదైనా జరిగితే రైతులు ఎవర్ని అడగాలో తెలియని పరిస్థితి ఉంది. మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో మిరప విత్తనకాయలు విక్రయించే వ్యాపారులు ప్రభుత్వ అనుమతులు లేకుండా విక్రయిస్తున్నారు. ట్యాక్స్ ఎగొట్టి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఈ జీరో వ్యాపారం మా పరిధిలోకి రాదు. విత్తనాలు నేరుగా విక్రయిస్తే మేం చర్యలు తీసుకోగలం.

- పెన్నయ్య, ఏఓ, విడపనకల్లు

చీనీకాయలు టన్ను రూ.32 వేలు

అనంతపురం రూరల్, జూన్ 20: అనంత వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.32 వేలు, కనిష్ఠంగా రూ.12 వేలు, సరాసరి రూ.20 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్ కు మొత్తంగా 725 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

27 నుంచి అంతర్ జిల్లా హాకీ పోటీలు

ధర్మవరం, జూన్ 20: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో ఈనెల 27 నుంచి 30వతేదీ వరకు 14వ అంతర్‌జిల్లాల సీనియర్ పురుషుల హాకీ పోటీలు నిర్వహిస్తున్నట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షులు బంధనాథం సూర్యప్రకాశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో 20 జిల్లాల జట్లు పాల్గొంటున్నాయన్నారు.

రెండు రోజుల్లో విద్యార్థులు వసతి గృహాల్లో చేరాలి

బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 20: జిల్లాలోని బీసీ ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాల్లో ఈ విద్యాసంవత్సరానికి సంబంధించిన రెన్యువల్ విద్యార్థులు వసతి గృహాల్లో చేరాలని, లేనిపక్షంలో వసతి కోల్పోయే ప్రమాదముందని బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాసంవత్సరం ప్రారంభమై 10 రోజులు గడుస్తున్నా రెన్యువల్ విద్యార్థులు హాస్టళ్లకు రావడం లేదన్నారు. జిల్లాలో 38 ప్రీమెట్రిక్, 17 పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాల్లో 5178 మంది రెన్యువల్ విద్యార్థులు ఉండగా 2295 మంది మాత్రమే హాజరయ్యారన్నారు. మిగిలిన 2883 మంది విద్యార్థులు హాజరుకాలేదన్నారు. వీరు రెండు రోజుల్లో ఆయా వసతిగృహాలకు హాజరుకావాలన్నారు. అదేవిధంగా కొత్తగా ప్రవేశాల కోసం 38 ప్రీమెట్రిక్ వసతిగృహాల్లో బాలురు 3103, బాలికలు 1364, 17 పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాల్లో బాలురు 622, బాలికలు 547 సీట్లు ఉన్నాయన్నారు. అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ విద్యా సంవత్సరం కళ్యాణదుర్గంలో కొత్తగా బాలికల వసతి గృహం ప్రారంభమవుతుందన్నారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న బాలికలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో వసతి కోసం వార్డెన్ 8008671755ను సంప్రదించాలన్నారు.

రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి

ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి

కరువు బృందానికి వినతిపత్రం అందజేత



కేంద్ర బృందానికి చెందిన అధికారి కూర్మనాథకు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

అనంతపురం కల్చరల్, జూన్ 20: జిల్లాలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతాంగాన్ని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.10వేల కోట్లతో ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లాలో కరువు పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు అనంతపురం వచ్చిన కేంద్ర బృందాన్ని గురువారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో రైతుసంఘం నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 2023 ఖరీఫ్, రబీలలో అతివృష్టి, అనావృష్టి వల్ల సాగుచేసిన వేరుశనగ, శనగ, మిరప, పత్తి, కంది, ఆముదం, జొన్న, కొర్ర, మొక్కజొన్న, ఉలవలు, ఉద్దులు, సజ్జ, పొద్దుతిరుగుడు, మినుములు, పెసలు, సోయాబీన్, తెల్ల కుసుమ తదితర పంటలను రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. ఆయకట్టు కింద సాగుచేసిన పంటలకు సైతం నీరందలేదన్నారు. దీంతో పెట్టిన పెట్టుబడులు రాక, చేసిన అప్పులు ఎలా కట్టాలో తెలియక రైతాంగం దిక్కుతోచని స్థితిలో ఉందన్నారు. నాలుగు సంవత్సరాలుగా అన్ని పంటలు దెబ్బతిని, కనీసం పెట్టిన పెట్టుబడులు రాక రైతులు అప్పుల్లో కూరుకుపోయారన్నారు. 2019లో 46 మంది రైతులు, 2020లో 67, 2021లో 41, 2022లో 66, 2023లో 48 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2023 ఖరీఫ్‌లో 28 మండలాలను, రబీలో 14 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినప్పటికీ నివారణ కోసం ఎలాంటి ప్రత్యేక నిధులు కేటాయించలేదన్నారు. రైతాంగ ఆత్మహత్యలను నివారించడంతోపాటు జిల్లాలోని రైతులను, కూలీలను ఆదుకునేందుకు వెంటనే జిల్లాకు రూ.10వేల కోట్లతో ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతుసంఘం నాయకుడు వన్నూరప్ప పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోండి

కేంద్ర కరువు బృందం అధికారి రితేష్ చౌహాన్‌కు ఎంపీ వినతి



రితేష్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం అర్బన్, జూన్ 20: అనంత ఉమ్మడి జిల్లాలో గత ఏడాది రబీ సీజన్‌లో పంటనష్టపోయిన రైతులను ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వ ఇంటర్ మినిస్టీరియల్ బృందం టీం లీడర్ రితేష్ చౌహాన్‌ను అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. గురువారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. గత ఏడాది రబీ సీజన్‌లో వర్షాభావంతో పప్పుశనగతో పాటు ఇతర రకాల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. బాధిత రైతులకు పంటనష్టపరిహారం అందించేలా నివేదికలు అందించి ఆదుకోవాలని కోరారు. పంటనష్టపోయిన రైతులకు రూ.140 కోట్లు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పలు రైళ్ల రద్దు.. దారి మళ్లింపు



గుంతకల్లు, జూన్ 20: దక్షిణమధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్‌లోని ఖాజీపేట్-బాలార్షా రైల్వే సెక్షన్‌లో జరుగుతున్న సేఫ్టీ రిలేటెడ్ పనుల కారణంగా గుంతకల్లు రైల్వే డివిజన్‌లో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్లు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం-గుంతకల్లు, అనంతపురం-డోన్ స్టేషన్ల మీదుగా వెళ్లే కొన్ని రైళ్లను రద్దుపరచనున్నామని, మరికొన్నింటికి సంబంధించి దారి మళ్లించనున్నట్లు తెలిపారు.

రద్దుకానున్న రైళ్లు

మైసూరు-జైపూర్ బైవీక్లీ ఎక్స్‌ప్రెస్ (నెం. 12975) రైలును ఈ నెల 27, 29, జూలై 4, 6 తేదీల్లో, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 12976)ను జూన్ 24, 26, జూలై 1, 3 తేదీల్లో రద్దుపరుస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. యశ్వంతపూర్-జబల్పూర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ (నెం. 12193)ను ఈ నెల 23, 30 తేదీల్లోనూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 12194)ను ఈ నెల 22, 29 తేదీల్లోనూ, గోరఖ్‌పూర్-యశ్వంతపూర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ (22533)ను ఈ నెల 24, జూలై 1వ తేదీల్లోనూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 22534)ను జూన్ 26, జూలై 3 తేదీల్లో రద్దు చేస్తున్నామన్నారు. యశ్వంతపూర్-గయ వీక్లీ ప్రత్యేక రైలు (నెం. 06217)ను ఈ నెల 22, 29 తేదీల్లోనూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 06218)ని జూన్ 24, జూలై 1వ తేదీలలో రద్దుచేశామన్నారు. అదే విధంగా హుబ్లీ-గోమతి నగర్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ (నెం. 07305)ను ఈ నెల 22, 29 తేదీల్లోనూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 07306)ను ఈ నెల 25, 27 తేదీల్లో రద్దుపరుస్తున్నట్లు పేర్కొన్నారు.

దారిమళ్లిన రైళ్లు

గోరఖ్‌పూర్-యశ్వంతపూర్ రైలు (నెం. 12591)ను ఈ నెల 29, జూలై 6 తేదీల్లోనూ, రైలు (నెం. 12592)ను ఈనెల 24, జూలై 1 తేదీల్లోనూ మజ్రి, ముడ్‌ఖేడ్, నిజామాబాద్, సికింద్రాబాద్ మీదుగా మళ్లించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. బెంగళూరు-హజ్రత్ నిజాముద్దీన్-బెంగళూరు రాజధాని ఎక్స్‌ప్రెస్ (నెం. 22691/92) రైళ్లను జూలై 3, 4, 5 తేదీల్లో సేవాగ్రాం, వార్ధా, అకోలా, నాందేడ్, నిజామాబాద్, సికింద్రాబాద్ మీదుగా మళ్లించనున్నామన్నారు. యశ్వంతపూర్-హజ్రత్ నిజాముద్దీన్ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ (నెం. 12649)ను జూలై 3, 5 తేదీల్లో గుంతకల్లు, వాడి, డౌండ్, మన్మాడ్, ఇటార్సి స్టేషన్ల మీదుగా మళ్లిస్తున్నామని, బెంగళూరు-న్యూఢిల్లీ కర్ణాటక ఎక్స్‌ప్రెస్ (నెం. 12627)ను ఈ నెల 28వ తేదీన అరగంట, 29వ తేదీన రెండు గంటల ఆలస్యంగా నడపనున్నట్లు తెలిపారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 12628)ని ఈనెల 28, 29 తేదీల్లో గంటన్నరపాటు ఆలస్యంగా నడుస్తుందని పేర్కొన్నారు. ప్రయాణికులు సహకరించాలని కోరారు.

గుంతకల్లు: రైల్వే ట్రాక్ పనుల కారణంగా గుంతకల్లుకు చెందిన రెండు రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంతకల్లు-బోధన (నెం.07671) రైలును జూలై 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు, కాచిగూడ-గుంతకల్లు రైలు (నెం.07670)ను జూలై 2వ తేదీ నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు రద్దు చేసినట్లు వివరించారు. ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

సెలవులో హౌసింగ్ పీడీ

అనంతపురం సిటీ, జూన్ 20: వైసీపీ పక్షపాత అధికారిగా ఆరోపణలున్న జిల్లా గృహ నిర్మాణశాఖ ఇన్‌చార్జి పీడీ నరసింహారెడ్డి శుక్రవారం నుంచి వారం రోజుల పాటు సెలవులో వెళ్లడం చర్చనీయాంశమైంది. అంతేకాకుండా అదే కార్యాలయంలో పనిచేస్తున్న డీఈఈ నారాయణమ్మకు ఇన్‌చార్జి పీడీగా బాధ్యతలు ఇవ్వాలని ఆయన కలెక్టర్‌కు సిఫార్సు చేయడం ఆ శాఖలో కలకలం రేపుతోంది. అనంతపురం ఈఈ శైలజ ఉండగా.. డీఈఈకి ఇన్‌చార్జిగా సిఫార్సు చేయడంపై విమర్శలకు తావిస్తోంది. టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతోనే పీడీ సెలవులో వెళ్లినట్లు సమాచారం. అయితే ఇటీవల ఆయన కాలికి గాయం కావడంతో సెలవులో వెళ్లారని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

అన్వేషణ

పనిచేసే అధికారుల కోసం జల్లెడ

వైసీపీ ఐదేళ్ల విధులపై నివేదికలు తెప్పించుకుంటున్న నాయకులు

కీలక పోస్టులపై మరింత ఆరా

వైసీపీతో అంటకాగిన వారికి స్వస్తి



హిందూపురం, జూన్ 20: వైసీపీ పాలనలో విధుల్లో ప్రజలకు సేవ చేయడంకంటే అధికార పార్టీ నాయకులు చెప్పినవాటికి తలూపే వారికి, ప్రతిపక్ష నాయకులను టార్గెట్ చేసేవారినే ఎన్నుకుని పోస్టింగ్ ఇచ్చారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో అలాంటి వాటికి స్వస్తిపలికి ప్రజాసమస్యలు పరిష్కరించేవారికి, పాలనపై దృష్టిపెట్టే అధికారుల కోసం ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు అన్వేషిస్తున్నారు. వైసీపీ పాలనలో పనిచేసిన అధికారులకు అధికశాతం మందికి వైసీపీ నాయకులు మరకలంటించారు. బాగా పనిచేసే అధికారులను పక్కనబెట్టి, ప్రజలతో సత్సంబంధాలులేని వారికి పోస్టింగ్ ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలో మంచి అధికారులు, బాగా పనిచేసేవారినే నియమించుకోవాలనీ, గత ప్రభుత్వం చేసిన తప్పిదం చేయకూడదంటూ పైస్థాయి నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో వారం రోజులుగా పోలీస్, రెవెన్యూ, మునిసిపల్, ఎంపీడీఓ, ఎక్సైజ్‌తోపాటు ప్రజలతో సత్సంబంధాలున్న శాఖలకు సంబంధించి అధికారుల కోసం వెతుకులాటలో పడ్డారు.

పనిచేసే అధికారుల కోసం జల్లెడ

సమర్థవంతంగా పనిచేసే అధికారులను తీసుకొచ్చే పనిలో ఎమ్మెల్యేలు పడ్డారు. మరికొన్ని చోట్లయితే గత తెలుగుదేశం హయాంలో బాగా పనిచేసిన అధికారుల కోసం జల్లెడ పడుతున్నారు. కొన్నిశాఖల్లో జిల్లాలో పట్టుమని పదిమంది కూడా వారు ఊహించినట్లు దొరకట్లేదని తెలుస్తోంది. దీంతో పక్కజిల్లాలో పనిచేసే వారిపై కూడా ఆరాతీస్తున్నారు. పోలీస్‌శాఖలో ఈ అన్వేషణ అధికంగా ఉంది. హిందూపురం నియోజకవర్గానికి సంబంధించి పోలీస్‌శాఖలో పనిచేస్తున్న అధికారులను ఇక్కడకు రప్పించుకునేందుకు ఆరాతీస్తున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో హిందూపురం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఎన్నడూలేని విధంగా సుపారీ హత్యలు జరగడం, గంజాయి వ్యాపారం వీధి వీధినా దుకాణాలు తెరవడం, పల్లెకో పేకాట కేంద్రం నిర్వహించడం, మద్యం విచ్చలవిడిగా అమ్మకం వంటికి జరిగాయి. వీటికి చెక్ పెట్టాలంటే హిందూపురానికి బాధ్యతగా పనిచేసేవారు కావాలి. అటువంటి వారిని అన్వేషించే పనిలో నాయకులు పడ్డారు. ప్రస్తుతం జిల్లాలో అలాంటి వారు కనిపించకపోవడంతో పక్క జిల్లాలో లూప్‌లైన్‌లో ఉన్న అధికారుల కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. వైసీపీ పాలనలో ఐదేళ్లలో అధికారులు ఎలా పనిచేశారు. అక్కడ ప్రతిపక్షానికి, అధికార పక్షంతో ఎలా మెలిగారు..? అవినీతికి పాల్పడ్డారా..? అనే అంశాలపై ఆరాతీస్తున్నారు. ఆ దిశగా వారి ట్రాక్ రికార్డుతో నివేదికలు తెప్పించుకుంటున్నట్లు తెలిసింది.

కీలక పోస్టులపై మరింత ఆరా..

జిల్లాస్థాయి అధికారుల విషయంలో మరిన్ని జాగ్రత్తలు పాటిస్తున్నారు. 2019నుంచి 2024 వరకు వారు పనిచేసిన జిల్లాల్లో ఎలా వ్యవహరించారన్న విషయంపై లోతుగా ఆరాతీస్తున్నారు. మంచి పాలన అందించాలంటే అధికారుల సహకారం ఎంతో అవసరం. జిల్లాస్థాయిలో కీలక పోస్టుల్లో ఉన్నవారు చాలా జాగ్రత్తగా పనిచేయాల్సి ఉంటుంది. జిల్లాలో ఇద్దరు మంత్రులతోపాటు హిందూపురం శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ కావడంతో ఇక్కడ పనిచేసే అధికారులు విధులపట్ల మరింత జాగ్రత్తగా మెలగాల్సి ఉంటుంది. ఇదే సందర్భంలో బాలకృష్ణ.. అధికారుల పనితీరుపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఆయన బిజీగా ఉంటారని భావించినా జిల్లా ఉన్నతస్థాయిలో ఉన్న అధికారుల పనితీరుపై ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటారు. దీంతో ఇక్కడ పనిచేసే అధికారులు మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వైసీపీతో అంటకాగిన వారికి స్వస్తిపలికి ప్రజాపాలనకు పాటుపడి, విధుల్లో మంచి పనితీరు కనబరిచే వారికోసం అన్వేషిస్తున్నట్లు ఓ ముఖ్య ప్రజాప్రతినిధి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

చనిపోయిన ఐదురోజులకు పోస్టుమార్టం

బుక్కపట్నం, జూన్ 20: యువతి చనిపోయిన ఐదు రోజుల తరువాత పోస్టుమార్టం నిర్వహించారు. మండలంలోని మారాల గ్రామానికి చెందిన స్రవంతి (20) ఈనెల 15న మృతి చెందింది. ముదిగుబ్బ మండలంలోని కొట్టాల గ్రామానికి చెందిన రవిచంద్రను ప్రేమిస్తున్నానని స్రవంతి తన తండ్రి ఈదుల సుధాకర్‌కు తెలిపింది. ఆయన మందలించడంతో ధర్మవరం మండలంలోని బిల్వంపల్లి గ్రామంలోని అమ్మమ్మ మస్తానమ్మ వద్ద ఉంటోంది. అయితే 15వ తేదీన స్రవంతి మృతి చెందినట్లు మస్తానమ్మ సుధాకర్‌కు ఫోన్ చేసింది. సుధాకర్‌తోపాటు బంధువులు శ్రావంతి మృతదేహాన్ని మరాల గ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు చేశారు. అయితే తన కుమార్తె మృతిపై అనుమానాలు ఉన్నాయని తండ్రి సుధాకర్ బుధవారం ధర్మవరం రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో ధర్మవరం రూరల్ ఎస్ఐ నరేంద్రతోపాటు బుక్కపట్నం తహసీల్దార్ భారతి, వైద్యులు క్రాంతికుమార్, హేమీమాభూషణ్, ఏఎస్ఐ రమణ మరాలకు చేరుకుని శ్రావంతి సమాధిని తవ్వి పోస్టుమార్టం నిర్వహించారు. వివరాలు త్వరలో వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



చంద్రమౌళి (ఫైల్)

నార్పల, జూన్ 20: మండలంలోని బొందలవాడ గ్రామంలో గురువారం విద్యుదాఘాతంతో రైతు చంద్రమౌళి (48) మృతి చెందాడు. చంద్రమౌళి అరటిపంటను సాగుచేస్తున్నాడు. పంటకు నీరు పెట్టేందుకు వెళ్లి మోటర్ ఆన్ చేశాడు. విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మృతుడి తండ్రి వన్నూరప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. టీడీపీ జిల్లా నాయకులు ఆలం వెంకటనరసానాయుడు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు.

వాహనాల దారి మళ్లింపు

పెనుకొండ టౌన్: సోమందేపల్లి మండలం చాకర్లపల్లి రైల్వే గేటు మరమ్మతు పనుల నేపథ్యంలో వాహనాల దారి మళ్లిస్తున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే లెవెల్‌క్రాస్ వద్ద శుక్రవారం పెద్దఎత్తున మరమ్మతు పనులు చేపడుతుండగా గురువారం అర్ధరాత్రి నుంచి హిందూపురం-పెనుకొండ ప్రధాన రహదారిలోని గేటును మూసివేస్తున్నట్లు తెలిపారు. అటువైపు వెళ్లే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లాలని సూచించారు.

24న పారా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 20: రాయలసీమ స్థాయి పారా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఈనెల 24న స్థానిక నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో నిర్వహించనున్నట్లు జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు తెలిపారు. అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు ఉమ్మడి జిల్లాల అథ్లెట్లు హాజరవుతారన్నారు. ఎంపికైన వారు రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్‌లో ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వివరాలకు 9390388169, 8074106154 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సంక్షిప్తంగా..

రైతు బజారులో పచ్చిమిర్చి విక్రయాలు

అనంతపురంరూరల్, జూన్ 20: జిల్లా మార్కెట్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి రైతుబజారులో పచ్చిమిర్చి విక్రయాలు చేపట్టనున్నట్లు ఏడీ సత్యనారాయణ చౌదరి ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు విక్రయాలు ప్రారంభమవుతాయనీ, కిలో రూ.42తో విక్రయిస్తామని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త

రాప్తాడు, జూన్ 20: సీజనల్ వ్యాధులు సోకకుండా పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఎంపీడీఓ గీతావాణి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వర్షాకాలంలో అంటువ్యాధులు, దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులు, దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

అనంతపురంరూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ పుల్లయ్య ఆధ్వర్యంలో వైద్యుడు ప్రసాద్ సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇందులో పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్ఎం, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ దామోదర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పోలేపల్లిలో న్యాయసేవా సదస్సు

రామగిరి, జూన్ 20: మండలంలోని పోలేపల్లిలో టింబక్టు కలెక్టివ్ సహకారంతో ప్రతిభా వికలాంగుల సొసైటీ ఆధ్వర్యంలో గురువారం న్యాయసేవా సదస్సును నిర్వహించారు. సమావేశంలో వికలాంగుల చట్టాలపై అవగాహన కల్పించారు. మేనరికపు వివాహాలు చేసుకుంటే కలిగే అనర్థాలు వారు పడుతున్న బాధల గురించి తెలిపారు. కార్యక్రమంలో ప్రతిభా సొసైటి మేనేజర్ డాక్టర్ జ్యోతి, జయశ్రీ, అసోషియేట్ అక్షర సొసైటీ అధ్యక్షుడు నాగరాజు, డైరెక్టర్ అనిత, మిలితసి సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

అనంతపురం, జూన్ 20: అనంతపురం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)స్టేషన్‌లో శనివారం వాహనాల వేలం వేస్తున్నట్లు సెబ్ సీఐ యల్లయ్య తెలిపారు. వివిధ మద్యం కేసులలో పట్టుబడిన వాహనాలను బహిరంగ వేలం వేస్తామని, ఆసక్తి కలిగిన వారు డిపాజిట్ చెల్లించి, వేలంలో పాల్గొనవచ్చని అన్నారు.

మృతుడి ఆచూకీ లభ్యం

అనంతపురం, జూన్ 20: స్థానిక రాంనగర్ రైల్వేగేట్ సమీపంలో రెండురోజుల క్రితం మరణించిన వ్యక్తిని స్థానిక ఇందిరానగర్‌కు చెందిన మానెపోగుల జమ్మయ్యగా గుర్తించారు. మృతదేహాన్ని అతడి కుమారుడు పురుషోత్తంకు అప్పగించినట్లు సీఐ ప్రతాప్‌రెడ్డి గురువారం తెలిపారు.

పథకం పేరు మార్పుపై హర్షం

అనంతపురంరూరల్, జూన్ 20 : జగనన్న విదేశీ ఉన్నత విద్య పథకాన్ని డా. బీఆర్ అంబేడ్కర్ ఉన్నత విద్యగా పేరు మార్చడంపై ఎమ్మార్పీఎస్ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బీసీఆర్ దాస్ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఏపీ (లిడ్ క్యాప్)కు కృష్ణప్రసాద్ లాంటి నిజాయతీ అధికారిని నియమించడం సరైందన్నారు.

అనంతపురం సెంట్రల్ : విదేశీ విద్య పథకానికి జగన్ పేరును తొలగించి 'అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి'గా మార్చడంతో ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తంచేశారు. గురువారం నగరంలోని అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఇందులో రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి అక్కులప్ప, నాయకులు సంతోష్ కుమార్, నాగరాజు, రామాంజి పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు ఉపాధి అనుసంధానంపై..

నార్పల : ఉద్యాన పంటలకు ఉపాధి హామీ అనుసంధానం చేయడంపై నార్పల జనసేన నాయకులు గురువారం హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు తుపాకుల భాస్కర్, పొన్నతోట రామయ్య, షేక్ రహంతుల్లా, వినోదం నారాయణస్వామి, ఉట్టి నరసింహులు, లోకేష్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

శింగనమల, జూన్ 20: మండలంలో ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయలు కల్పించాలని వార్డెన్లకు ఎంపీడీవో బి.వెంకటరమణ సూచించారు. గురువారం మండలంలోని తరిమెల ఎస్సీ బాలురు వసతి గృహాన్ని ఆయన తనిఖీ చేశారు. భవనం శిథిలావస్థలో ఉండడంతో దాని మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపారు. మోను ప్రకారం భోజనం ఇస్తున్నారా, లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వార్డెన్ బసవరాజు పాల్గొన్నారు.

చిన్నారి అదృశ్యం


పావని

నార్పల: నార్పల కొత్తబస్టాండ్ కాలనీకి చెందిన పావని (6) గురువారం అదృశ్యమైనట్లు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. కొత్తబస్టాండ్ కాలనీకి చెందిన గణేష్ కుమార్తె పావని ఇంటి పరిసరాల్లో ఆడుకుంటూ బయటికి వెళ్లిపోయి అదృశ్య మైనట్లు తెలిపారు. పలుచోట్ల వెతికినా కనిపించలేదని, ఈ చిన్నారి ఎవరికైనా కనిపిస్తే 94901 06853 నంబరుకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ట్రైనింగ్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం కల్చరల్ : హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్సు కలిగిన డ్రైవర్లు తమ లైసెన్సును రెన్యువల్ చేయించుకునేందుకు నాన్ రెసిడెన్షియల్ ట్రైనింగ్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎస్ఆర్టీసీ హెవీ వెహికల్ డ్రైవింగ్ ట్రైనింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగభూపాల్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. సర్టిఫికెట్ పొందదలచిన డ్రైవర్లు రూ.వెయ్యితోపాటు 18 శాతం జీఎస్టీ అదనంగా రుసుము చెల్లించి అనంతపురం డిపోలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వారికి ఒకరోజు శిక్షణ ఇచ్చి, అనంతరం సర్టిఫికెట్ అందజేస్తారన్నారు.

23న 'రాష్ట్ర జనశక్తి' సర్వసభ్య సమావేశం

అనంతపురంరూరల్, జూన్ 20: రాష్ట్ర జనశక్తి ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 23న తిరుపతిలో నిర్వహిస్తున్నట్లు ఆ యూనియన్ జిల్లా సభ్యులు అనంత శ్రీనివాసరాజు, మేకల నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి పట్టణం తిరుచానూరులోని గాయత్రి రెసిడెన్సీలో ఈ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

ధాబా దగ్ధం

గార్లదిన్నె, జూన్ 20: స్థానిక సబ్ స్టేషన్‌కు ఎదురుగా గల ఈశ ధాబా గురువారం సాయంత్రం దగ్ధమైంది. గార్లదిన్నెలోని రఘురాముడుకు చెందిన ధాబాలో గురువారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు.. వాటిని ఆర్పేందుకు ప్రయత్నించారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి, మంటలను అదుపు చేశారు. అప్పటికే ఫర్నిచర్‌తోపాటు కొట్టాలు కాలి బూడిదయ్యాయి. ప్రమాదంలో రూ.2 లక్షల వరకూ నష్టం వాటిల్లినట్లు బాధితుడు రఘురాముడు వాపోయాడు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు.

ఎలుగుబంటి సంచారం

రాయదుర్గం రూరల్ : పట్టణ సమీపంలో మొలకాల్మూరు రోడ్డు అభయ ఆంజనేయస్వామి గుడి సమీపంలో ఎలుగుబంటి సంచరించడంతో కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. గురువారం సాయంత్రం ఎలుగుబం టి ఆలయ సమీపంలో సంచరించడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యోగాతో మానసిక ఒత్తిళ్లకు చెక్

అవగాహన ర్యాలీలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 20: ప్రాచీన భారతదేశ సంప్రదాయం నుంచి మనకు సంక్రమించిన గొప్ప వరం యోగా అని, రోజూ యోగా చేయడం వల్ల మానసిక ఒత్తిళ్ల నుంచి విముక్తి పొందవచ్చని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. పదో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక ఆర్ట్స్ కళాశాల వద్ద నుంచి ప్రారంభించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ ర్యాలీ టవర్‌క్లాక్, సుభాష్‌రోడ్డు, సప్తగిరి సర్కిల్, రాజురోడ్డు, శ్రీకంఠం సర్కిల్, ఆర్ఎఫ్ రోడ్డు, ఎన్టీఆర్ విగ్రహం వరకు సాగింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. యోగా మనసును, శరీరాన్ని సమన్వయం పరిచి పరిపూర్ణ ఆరోగ్యాన్ని ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ మునిరాజా, వివేకానంద యోగా కేంద్రం అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, ఆయుష్ వైద్యాధికారులు రామ్‌కుమార్, రఫీక్, తిరుపతి నాయుడు, బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయ సిస్టర్ సరళ, యోగా మాస్టర్లు ఆంజనేయులు, మారుతి ప్రసాద్, జిల్లా యువజన శాఖ, ఆయుష్ శాఖ, వివేకానంద యోగా కేంద్రం, జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.


ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

ఘనంగా నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు



అనంతపురం అర్బన్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు, నార్పలలో కేక్ కట్ చేస్తున్న ఆలం వెంకటనరసానాయుడు

అనంతపురం అర్బన్, జూన్ 20: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీనగర్ కాలనీలోని అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. విజయవాడలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన జన్మదిన వేడుకల్లో మాజీ మేయర్ స్వరూప పాల్గొన్నారు.

నార్పల: టీడీపీ స్థానిక కార్యాలయంలో ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్మన్ నారాభువనేశ్వరి జన్మదినాన్ని టీడీపీ జిల్లా నాయకుడు ఆలం వెంకట నరసా నాయుడు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి.. అందరికీ స్వీట్లు పంచారు. ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్మన్‌గా నారా భువనేశ్వరి కొన్ని వేల కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపుతూ అండగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఎర్రినాగప్ప, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉరుసు వేడుకలు ప్రారంభం


హజరత్ సయ్యద్ ఖాదర్ మొహిద్దీన్ షా ఖాద్రి దర్గా

అనంతపురం కల్చరల్ / బుక్కరాయసముద్రం, జూన్ 20 : చెరువుకట్టపై వెలసిన 'హజరత్ సయ్యద్ ఖాదర్ మొహిద్దీన్ షా ఖాద్రి' దర్గాలో స్వామివారి 140వ గంధం ఉరుసు వేడుకలు గురువారం సాయంత్రం ఘనంగా మొదలయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకల నేపథ్యంలో దర్గాను విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. సాయంత్రం దర్గా కమిటీ అధ్యక్షుడు మహబూబ్‌సాబ్ ఇంటి నుంచి గంధంను మేళతాలాలు, ఫకీర్ల విన్యాసాల నడుమ ఊరేగింపుగా దర్గా వరకు తీసుకెళ్లారు. అనంతరం దర్గాలో ఫాతేహ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు పూల మన్సూర్ అలి, జాఫర్, భక్తులు పాల్గొన్నారు. జిల్లాలోని పలువురు భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.


ఫకీర్ల జల్సాల నడుమ సాగుతున్న ఊరేగింపు

ఘనంగా రెవెన్యూ దినోత్సవం

అనంతపురం టౌన్, జూన్ 20: జిల్లా కేంద్రంలోని టవర్‌క్లాక్ సమీపంలోని రెవెన్యూ భవన్‌లో రెవెన్యూ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆర్డీఓ గ్రంది వెంకటేష్, విశ్రాంత రెవెన్యూ సంఘం నాయకులు పగడాల మల్లికార్జున, రామచంద్రారెడ్డి, రామశేషయ్య, వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరై, పోరాట జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెవెన్యూ అసోషియేషన్ సంఘం జిల్లా అధ్యక్షుడు కుళ్లాయప్ప, అమరావతి జేఏసీ జిల్లా చైర్మన్ దివాకరరావు, బోగన్నగౌడు, సంజీవరాయుడు, గోపాల్‌రెడ్డి, మంజునాథ్, భాస్కర్, నాగేంద్ర పాల్గొన్నారు.

అనంతపురంరూరల్ : స్థానిక డ్వామా హాల్‌లో అనంతపురం రెవెన్యూ డివిజన్ ఆధ్వర్యంలో రెవెన్యూ శాఖ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు, రైతులకు రెవెన్యూ శాఖ ప్రాముఖ్యతను ఆర్డీఓ వెంకటేష్ వివరించారు. విశ్రాంత రెవెన్యూ సిబ్బంది తిరుమలరెడ్డి, కుమారస్వామి, వెంకటేష్, రమేష్‌రెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం అర్బన్ తహసీల్దార్ శివరామిరెడ్డి, ఈడీటీ శ్రీరాములు పాల్గొన్నారు.

రాప్తాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఇందులో తహసీల్దార్ సీతారామన్, సర్పంచ్ సాకే తిరుపాలు, ఎంపీడీఓ గీతావాణి, ఈఓఆర్డీ నరసింహారెడ్డి, రిటైర్డ్ తహసీల్దార్ రామాంజినేయులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


అనంతపురంలో జెండాను ఆవిష్కరిస్తున్న రెవెన్యూ ఉద్యోగుల సంఘం నేతలు

శింగనమల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన రెవెన్యూ దినోత్సవంలో తహసీల్దార్ శోభన్‌బాబు, డిప్యూటి తహసీల్దార్ ప్రకాశ్‌రావు, రామకృష్ణ గోవిందురాజులు వెంకట్రామిరెడ్డి హనుమాన్ అధికారులు పాల్గొన్నారు.


రామగిరి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విశ్రాంత తహసీల్దార్ మధుసూదన్‌రావు, విశ్రాంత వీఆర్ఓ సుబ్రమణ్యంను ఘనంగా సత్కరించారు. ఇందులో తహసీల్దార్ రమణి, డిప్యూటీ తహసీల్దార్ నరేశ్‌బాబు, ఆర్ఐ నరసింహమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న నాయకులు

దరఖాస్తు చేసిన అందరికీ కేజీబీవీల్లో సీట్లు ఇవ్వాలి

అనంతపురం విద్య, జూన్ 20 : కరువు జిల్లాలో కేజీబీవీల్లో సీట్ల కోసం దరఖాస్తు చేసిన ప్రతి విద్యార్థికీ సీటు ఇవ్వాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సమగ్రశిక్ష ప్రాజక్టు వద్ద ఆ సంఘం నాయకులు ధర్నా చేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రమణయ్య, ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి మాట్లాడుతూ... జిల్లాలో పేదలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారన్నారు. దీంతో వారి పిల్లలకు కేజీబీవీల్లో సీట్ల కోసం ఆశగా చాలా మంది దరఖాస్తు చేశారన్నారు. వారి సమస్యలను గుర్తించి దరకాస్తు చేసిన వారందరికీ సీటు ఇవ్వాలన్నారు. కేజీబీవీల్లో సీట్లు కూడా పెంచాలని కోరారు. బోధన, బోధనేతర పోస్టులను తక్షణమే ప్రభుత్వం పెంచాలని డిమాండ్ చేశారు. కేజీబీవీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, కేజీబీవీ ఎస్ఓలు స్థానికంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు హనుమంతు, మంజునాథ్, ఉమామహేష్, వంశీ, హరిక్రిష్ణ, సమీర్, ఆనంద్, విశ్వసాయి, కార్తీక్, ఓబులేసు, సుమన్, పవన్ పాల్గొన్నారు.

హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయండి


నూతన సీఈఓను అభినందిస్తున్న సొసైటీ ఉద్యోగులు

అనంతపురం క్లాక్ టవర్, జూన్ 20: గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయకుండా కాలయా పన చేసిందని, ఇప్పుడైనా దాన్ని అమలు చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు గురువారం స్థానిక ఎన్టీఆర్ సహకారభవన్‌లో ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖరాణికి వినతిపత్రం అందజేశారు. ఏపీ రాష్ట్ర పీఏసీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంజనేయులు, హరికృష్ణలు మాట్లాడుతూ... సొసైటీ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని, సీనియార్టీ ప్రకారం వేతనాలు పెంచాలని అన్నారు. రైతుల పంట రుణాల రెన్యువల్ చేయాలని, వెంటనే వడ్డీ రేట్లు తగ్గించాలని అన్నారు. సమస్యలు పరిష్కరించి సొసైటీల బలోపేతానికి సహకరించాలని కోరారు. దీనికి సీఈఓ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం కోశాధికారి దామోదర్, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాసులు, డివిజనల్ సెక్రటరీ హనుమంతరెడ్డి, నాయకులు రామాంజినేయులు, రమణారెడ్డి, కుమార్, బొజ్జప్ప పాల్గొన్నారు.

ఉపా కేసులు ఎత్తివేయాలి

అనంతపురం సెంట్రల్, జూన్ 20: దేశ ప్రజా సమస్యలపై మేధావులు గళం విప్పడమే కేంద్ర ప్రభుత్వం నేరంగా భావించడం ఏంటని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ, ఏఐ ఎస్ఏ నాయకులు ప్రశ్నిం చారు. అరుంధతి రాయ్, ప్రొఫెసర్ షేక్ షౌకత్ హుస్సే నల్‌పై పెట్టిన ఉపా కేసులను ఎత్తివేయాలని, నేషనల్ టెస్ట్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను రద్దుచేయాలని వారు డిమాండ్‌చేశారు. ఈ మేరకు గురువారం లిబరేషన్, ఏఐఎస్ఏ సంయుక్తాధ్వర్యంలో నగరంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా కార్యదర్శి వలి, ఏఐఎస్ఏ జిల్లా అధ్యక్షుడు శివకుమార్, జిల్లా కన్వీనర్ బాలకృష్ణ మాట్లాడారు. సమాజంలో నెలకొంటున్న పరిస్థితులను చక్కదిద్దేందుకు మేధావులు ప్రజల్లో చైతన్యాన్ని తీసుకురావడానికి కృషిచేస్తారన్నారు. ఇది గిట్టని ప్రభుత్వాలు రాయ్, హుస్సేన్ తదితర వారిపై ఉపా చట్టాలను ప్రయోగించి ప్రజా గొంతుకులను అణచివేసేందుకు యత్నిస్తున్నాయని మండిపడ్డారు. నూతన కోర్సుల ప్రవేశాల కోసం పరీక్షలు నిర్వహించే ఎన్‌టీఏ అక్రమాలకు పాల్పడుతూ విద్యార్థుల భవిష్యత్తును కాలరాస్తోందని వాపోయారు. నీట్, యూజీసీ ఎన్, సెట్ పరీక్షల్లో నెలకొన్న అవకతవకలే ఇందుకు నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వ పెద్దల జేబుల నింపే ఆర్థిక వనరుగా ఎన్‌టీఏ మారిపోయిందని వివర్శించారు. కార్యక్రమంలో నాయకులు పరశురాం, సుజాతమ్మ, మహేష్, హేమంత్, అనిల్, మనోజ్ పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కార్మికులు చనిపోతున్నా పట్టించుకోరా?

అధికారులపై మున్సిపల్ యూనియన్ మండిపాటు

అనంతపురం క్రైం, జూన్ 20 : నగరపాలికలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులు సరైన వైద్యం అందక మృతి చెందుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మండిపడ్డారు. ఔట్‌సోర్సింగ్ కార్మికుడిగా పనిచేస్తున్న కొండన్న గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈ విషయంపై యూనియన్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. యూనియన్ రాష్ట అధ్యక్షుడు నాగభూషణం, జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు మాట్లాడుతూ... అధికారులు ప్రజల నుంచి పన్నులు కట్టించుకుంటారని, ఆదాయం చేకూరుస్తున్న కార్మికులు అనాథలుగా మృతి చెందుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎంహెచ్‌ఓ కార్మికులకు వైద్యం అందించకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. ఎంహెచ్‌ఓ విష్ణుమూర్తికి ప్లాస్టిక్ నిషేధంపై ఉన్న శ్రద్ధ కార్మికులపై లేదన్నారు. తాడిపత్రిలో క్లినిక్ పెట్టుకున్న ఎంహెచ్‌ఓ విషయంలో నగర కమిషనర్ ఎందుకు జోక్యం చేసుకోవడం లేదో అర్థం కావడం లేదన్నారు. కొండన్న దహన సంస్కారాలకు రూ.15వేలు కేటాయించి, వారి కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నల్లప్ప, బండారు ఎర్రిసామి, సాకే తిరుమలేష్, లక్ష్మినారాయణ, ఆదినారాయణ, శశీంద్రకుమార్ పాల్గొన్నారు.


అయ్యవారిపల్లిలో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ధర్మవరపు మురళి

వాటర్‌ప్లాంట్ ప్రారంభం

రాప్తాడు, జూన్ 20: మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో వాటర్‌ప్లాంట్‌ను టీడీపీ మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు తక్కువ ధరలకే సురక్షిత నీరు అందిస్తామన్నారు. పరిటాల ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామాల్లో వాటర్ ప్లాంట్‌లను నిర్మించి ప్రజలకు సురక్షిత నీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పంపు కొండప్ప, ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు, ఉప్పర శ్రీనివాసులు, తెలుగు యువత మండలాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధులకు బీసీజీ వ్యాక్సిన్ తప్పనిసరి


వృద్ధులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

చెన్నేకొత్తపల్లి, జూన్ 20: వృద్ధులు తప్పకుండా బీసీజీ వ్యాక్సిన్‌ను వేయించుకోవాలని వైద్యులు ఉదయ్‌కుమార్, రవినాయక్ సూచించారు. సీకేపీలో గురువారం నిర్వహించిన బీసీజీ వ్యాక్సిన్ వైద్య శిబిరంలో వారు మాట్లాడారు. ఈ వ్యాక్సిన్ ద్వారా క్షయ, బీపీ, షుగర్ తదితర వ్యాధులు సోకే అవకాశం ఉండబోదన్నారు. ఈ వ్యాధుల నివారణ కోసం ప్రభుత్వం ముందు జాగ్రత్తగా ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కావున వృద్ధులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ రామలక్ష్మి ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది వృద్ధులకు బీసీజీ టీకాలను వేశారు.

రోడ్డు ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

అనంతపురం అర్బన్, జూన్ 20: అనంతపురం నగరం 39వ డివిజన్‌లో రోడ్డు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మోహన్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురు వారం స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో నగర కమిషనర్ మేఘ స్వరూప్‌కు ఫిర్యాదు చేశారు. స్థానికులు ఐదు అడుగుల రోడ్డును ఆక్రమించి ప్రహరీని నిర్మించారని, దీంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇందుకు కమిషనర్ స్పందిస్తూ... రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.


కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న మోహన్‌కుమార్

ఘనంగా ఏఐసీఎఫ్ వార్షికోత్సవం

అనంతపురం కల్చరల్, జూన్ 20 : ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) 28వ వార్షికోత్సవాన్ని గురువారం అరవిందనగర్‌లోని జీసస్ కంపాషన్ చర్చిలో ఘనంగా నిర్వహించారు. ఏఐసీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విల్సన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు విక్టర్ డానియల్ పాల్గొన్నారు. నాయకులు హాజరై కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఏఐసీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కాంతిజాన్‌వెస్లీ, జిల్లా అధ్యక్షుడు కమలాకర్‌రావు, సభ్యులు మోజెస్ అనిల్‌కుమార్, కిరణ్‌కుమార్, ప్రణయ్, జీవన్ షాలేం పాల్గొన్నారు.

ఎయిడెడ్ వ్యవస్థకు నారా లోకేశ్ ఊపిరి

అనంతపురం విద్య, జూన్ 20 : విద్యాశాఖలో ఎయిడెడ్ వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం నాశనం చేయాలని చూస్తే.... జిల్లాలో పర్యటించిన ప్రస్తుత మంత్రి నారా లోకేశ్ ఊపిరి పోశారని అన్ ఎయిడెడ్ అధ్యాపక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నబిరసూల్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్రిటిష్ కాలం నుంచి కొనసాగుతున్న ఎయిడెడ్ కళాశాలలను గత జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూసిందన్నారు. అన్ ఎయిడెడ్ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది జీతాలను, పేద విద్యార్థులను చదువుకు దూరం చేసేలా జీవో 42 తీసుకొచ్చిందన్నారు. ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అప్పట్లో అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలకు వచ్చి ఎయిడెడ్ సమస్యపై స్పందించడంతో.. అప్పటి ప్రభుత్వం వెనక్కు తగ్గిందన్నారు. ప్రస్తుతం విద్యాశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న నారా లోకేష్ వల్ల ఎయిడెడ్ కళాశాలలలో పనిచేసే అధ్యాపక అధ్యాపకేతరుల, విద్యార్థుల సమస్యలను పరిష్కరించి మరింత న్యాయం చేయాలని కోరారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు
● ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు


అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం రూరల్, జూన్ 20: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించేందుకు అధికారులు సిద్ధం కావాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. గురువారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఎంపీడీఓలు, తహసీల్దార్, సీఎస్‌డీటీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంచి పాలన అందించేందుకు అధికారులు సహకరించాలన్నారు. ప్రజల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువచ్చినపుడు వాటిని పరిష్కరించాలన్నారు. గ్రామాలలోని టీడీపీ నాయకులు సమస్యల పరిష్కారానికి కార్యాలయానికి వచ్చినపుడు క్షుణ్ణంగా పరిశీలించి, వాటిని పరిష్కరించాలన్నారు. తహసీల్దార్ చిట్టిబాబు, ఎంపీడీఓ అల్లాబకాష్ పాల్గొన్నారు.

మంత్రి నారాయణకు సన్మానం


మంత్రికి వెంకటేశ్వరస్వామి ప్రతిమను బహూకరిస్తున్న ఉద్యోగులు

గుంతకల్లు, జూన్ 20: మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణ అభివృద్ధి శాఖా మంత్రి నారాయణను ఏపీ టౌన్‌ప్లానింగ్ అసోసియేషన్ నాయకులు గురువారం సన్మానించారు. విజయవాడలోని ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయానికి వెళ్లిన స్థానిక అధికారులు మంత్రితో భేటీ అయ్యి ఆయన్ను సన్మానించి, వెంకటేశ్వర స్వామి ప్రతిమను బహూకరించారు. సన్మానించిన వారిలో ఏపీ టౌన్ ప్లానింగ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు సత్తార్ సాబ్, ఈసీ సభ్యుడు మురళీ మోహన్ పాల్గొన్నారు.

రైతాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసిన జగన్


మాట్లాడుతున్న మధుసూదన్ గుప్తా

గుత్తి, జూన్ 20: వైఎస్ జగన్ అధికారంలో ఉన్నప్పుడు రైతాంగ వ్యవస్థలను పూర్తిగా నిర్వీర్యం చేశాడని మాజీ ఎమ్మెల్యే కొట్రికే మధుసూదన్ గుప్తా ఆరోపించారు. గుత్తి ఆర్ఎస్‌లోని ఆయన స్వగృహం వద్ద గురువారం విలేకరులతో మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలిసంతకంతోనే ఉపాధి హామీ పథకాన్ని రైతులకు అనుసంధానం చేస్తున్నట్లు తీసుకున్న నిర్ణయం హర్షదాయకమన్నారు. రైతులకు ఎంతో దోహదపడుతుందన్నారు. జగన్ ప్రభుత్వం రైతులకు ఎటువంటి పరికరాలు అందించలేదన్నారు. ఈ ప్రభుత్వం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గుత్తిలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం గుత్తి చెరువును తాగునీటి సమ్మర్ స్టోరేజ్‌గా మార్చాలన్నారు. సమావేశంలో జనసేన నాయకులు వలి పాల్గొన్నారు.

గుణాత్మక విద్య బోధించాలి

ఉరవకొండ, జూన్ 20: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు గుణాత్మక విద్య బోధించాలని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త వైఖోమ్ నిదియాదేవి.. ఉపాధ్యాయులకు సూచించారు. వజ్రకరూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ నాణ్యమైన విద్యను అందించడం ద్వారా విద్యార్థులను తీర్చిదిద్దవచ్చునన్నారు. పిల్లలు ఉత్తమ పౌరులుగా ఎదగడంలో ఉపాధ్యాయులది కీలకపాత్ర అని గుర్తు చేశారు. కిట్స్ సకాలంలో విద్యార్థులకు చేరాలని, ఎంఈవో ఎర్రిస్వామి, తిమ్మప్పలను ఆదేశించారు.

అనుమానాస్పద మృతిపై స్పందించలేదని నిరసన

పుట్లూరు, జూన్ 20: మండలంలోని కడవకల్లు గ్రామంలో రెండునెలల క్రితం అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన చంద్రకళ కేసులో పురోగతి లేదని గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఆమె బంధువులు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ చంద్రకళ మృతిపై తమకు పలు అనుమానాలు ఉన్నాయని, కేసును విచారించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి దర్యాప్తు వేగవంతం చేసి మృతికి సంబంధించిన మిస్టరీని ఛేదించాలని కోరారు. నాగేష్, గోవిందు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

పామిడి, జూన్ 20: కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్ సూచించారు. పట్టణంలోని సీహెచ్‌సీని గురువారం సాయంత్రం ఆయన తనఖీ చేశారు. డాక్టర్లు, నర్సులు, ఆసుపత్రి సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలోని హెడ్‌నర్సు శివకుమారిపై వచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టారు. ఆరోపణలపై ఆధారాలు లభ్యమయితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

కలెక్టర్ విస్తృత తనిఖీలు
● హాస్టల్‌వార్డెన్ లేకపోవడంతో సీరియస్
● బీసీ హాస్టల్ నిర్వహణపై ఆగ్రహం


హాస్టల్‌లో వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ వినోద్ కుమార్

తాడిపత్రి టౌన్, జూన్ 20: పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, బీసీ హాస్టల్‌ను గురువారం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ తనిఖీ చేశారు. మధ్యాహ్న సమయంలో వచ్చిన కలెక్టర్ నేరుగా బీసీ హాస్టల్‌కు వెళ్లారు. ఆ సమయంలో వార్డెన్ బాబు లేకపోవడంతోపాటు ఫోన్‌చేసినా స్విచాఫ్ రావడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం హాస్టల్‌లోని రూములన్ని పరిశీలించారు. కొన్ని రూములకు బీగాలు వేయడంపై ఆరాతీశారు. హాస్టల్‌లో పరిశుభ్రత లోపించడంపై సిబ్బందిని మందలించారు. విద్యార్థుల శాతం గణనీయంగా పెంచాలని సూచించారు. వార్డెన్‌కు నోటీసు జారీచేయాలని ఆదేశించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న కలెక్టర్ పలు రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ సరిగా చేయాలన్నారు. ఐఎస్‌ఓ ప్రమాణాలతో కార్యాలయం ఉండాలన్నారు. నాణ్యత ప్రమాణాలను మరింత మెరుగుపరిచి కార్యాలయానికి ఐఎస్‌ఓ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేయాలన్నారు. అనంతరం కార్యాలయానికి వచ్చిన ప్రజలను పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన వృద్ధురాలు ఆస్తికి సంబంధించిన సర్టిఫికెట్ గురించి పదిరోజులుగా తిరుగుతున్నా పట్టించుకోదని కలెక్టర్ వద్ద వాపోయింది. స్పందించిన కలెక్టర్ వృద్ధురాలి సమస్యను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ ఆంజనేయులును ఆదేశించారు. కార్యాలయ ఆవరణంలో ఉన్న సెకెండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టును కలెక్టర్ సందర్శించారు. అక్కడ ఉన్న రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట సాంఘికసంక్షేమ శాఖ జేడీ మధుసూదన్‌రావు, అధికారులు ఫక్కీరయ్య, సిబ్బంది ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి


మోటారును ప్రారంభిస్తున్న ఈశ్వర్

గుత్తి, జూన్ 20: మున్సిపల్ పరిధిలోని గుత్తిఆర్ఎస్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ అన్నారు. స్థానిక 8వ వార్డులో కొన్నేళ్లుగా తాగునీటి కోసం కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎన్నికల ముందు గుమ్మనూరు జయరాం ఇచ్చిన హామీ మేరకు గురువారం కాలనీలో నూతనంగా బోరును ఏర్పాటు చేసి పైప్‌లైన్‌ను విస్తరించి ఇంటింటికి నీటి సరఫరా చేసేలా పనులు చేపట్టారు. టీడీపీ వార్డు ఇన్‌చార్జి అబ్దుల్‌వహాబ్, బోర్‌వెల్ నాగరాజు, ఎంకే చౌదరి, చికెన్ శ్రీనివాసులు, న్యాయవాది సోమశేఖర్, వీరన్న, ఇలియాజ్, రాము, చిదంబరయ్య, ప్రసాద్, రమణ పాల్గొన్నారు.

9వ డిస్ట్రిబ్యూటరీ కాలువను బాగుచేస్తాం


పంట కాలువను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

బొమ్మనహాళ్, జూన్ 20: మండలంలోని గోవిందవాడ గ్రామం వద్ద ఎగువ కాలువ నుంచి వచ్చే 9వ డిస్ట్రిబ్యూటరీని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లి బాగు పరుస్తామని టీడీపీ నాయకులు సోమనాథ్‌గౌడ్, ఎస్‌జీ వన్నూరుస్వామి అన్నారు. 17వ తేదీన అధ్వానంగా పంటకాలువలు అనే శీర్షిక ఆంధ్రజ్యోతిలో ప్రచురించడంతో టీడీపీ నాయకులు గురువారం పరిశీలించారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి కాలువ పనులను బాగు చేయిస్తామని తెలిపారు. కటంబ్లి సుంకన్న, చౌళ వన్నూరుస్వామి, బంగి లోకేష్, నటరాజ్, సొంటి వన్నూరుస్వామి, వన్నూరుస్వామి, దేవేంద్రప్ప ఉన్నారు.

ఆలయాల్లో టీడీపీ నాయకుల పూజలు

గుత్తి రూరల్,జూన్ 20: ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఎమ్మెల్యేగా గుమ్మనూరు జయరాం గెలుపొందడంతో టీడీపీ నాయకులు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం మండలంలోని బేతాపల్లి, యంగన్నపల్లి గ్రామాల్లో జయరాం తనయుడు, సోదరుడు, ఈశ్వర్, నారాయణ 101 టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. మండల కన్వీనర్ బర్దీవలి, ఏంకే చౌదరి, సర్పంచు భరత్, ఎంపీటీసీలు జింకల నారాయణ స్వామి, రమేష్ పాల్గొన్నారు.

తాడిపత్రి ఆలయానికి గుర్తింపుపై హర్షం

తాడిపత్రిటౌన్, జూన్ 20: పట్టణంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయానికి ప్రత్యేక గుర్తింపు రావడంతో ఆలయ అర్చకులతోపాటు ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 2024-25 విద్యాసంవత్సరంలో మారిన 10వ తరగతి పాఠ్యపుస్తకాల్లో సాంఘికశాస్త్రం చరిత్ర పాఠ్యపుస్తకం కవర్‌పేజీపై ఆలయ గోపురం ముద్రించారు. దీనిపై ఆలయ అర్చకులు స్పందిస్తూ రాయలవారి పాలనలో నిర్మితమైన అత్యద్భుత శిల్పకళతో మన చరిత్ర, నాగరికత నేటి తరంతోపాటు భవిష్యత్తు తరాలకు అందించే విధంగా ఉన్న ఆలయానికి ప్రత్యేక గుర్తింపు రావడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఆలయ గోపురం ఉన్న పాఠ్యపుస్తకాన్ని అర్చకులు శంకరయ్య, మహేష్‌శర్మ, రవిశర్మ, గిరీష్‌శర్మ, నందశర్మ ప్రదర్శించారు.

హత్యకేసులో నిందితుల అరెస్టు

కళ్యాణదుర్గం రూరల్, జూన్ 20: పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద 14వ తేదీన ఓ వృద్ధుడిని గుర్తు తెలియని వ్యక్తులు బండరాయితో మోది హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న జిల్లా ఎస్పీ గౌతమిశాలి త్వరితగతిన ఛేదించాలని ఆదేశించారు. డీఎస్పీ శ్రీనివాసులు సూచనల మేరకు రంగంలోకి దిగిన పట్టణ సీఐ హరినాథ్, పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించి గురువారం బెళుగుప్ప రోడ్డులోని నాగులకట్ట వద్ద అరెస్టు చేశారు. రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును త్వరగా ఛేదించిన సీఐ హరినాథ్‌ను ఎస్పీ అభినందించారు.

చేనేత పరికరాలు ఇస్తామని మోసం

ఉరవకొండ, జూన్ 20: పెన్నహోబిలేశ్వర క్లస్టర్‌లో చేనేత పరికరాలు ఇస్తామని చెప్పి, డబ్బులు కట్టించుకుని ఆరు నెలలు అయినా పరికరాలు ఇవ్వలేదని, క్లస్టర్ సభ్యులు తెలిపారు. పట్టణంలో గురువారం సభ్యులు మాట్లాడుతూ ఆరు నెలల క్రితం పెన్నహోబిలేశ్వర క్లస్టర్ ఏర్పాటు చేశారని, అందులో 250 మంది దాకా సభ్యులు ఉన్నారని, 69మందితో పరికరాలను బట్టి డబ్బులు చెల్లించామన్నారు. ఆరు నెలలు గడిచినా పరికరాలు కానీ, డబ్బులు కానీ ఇవ్వలేదన్నారు. క్లస్టర్ ట్రైనర్‌కు ఫోన్ చేస్తే స్పందించడం లేదన్నారు. ట్రైనింగ్ కూడా ఇవ్వకనే ఎలా డబ్బు కట్టించుకున్నారని ప్రశ్నించారు. ఎవరిని అడిగినా సమాధానం చెప్పడం లేదన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

పుస్తకాలను అంగడి సరుకుల్లా అమ్ముతున్నా పట్టించుకోరా?

రాయదుర్గం రూరల్, జూన్ 20: పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం పాఠ్యపుస్తకాలను అమ్ముతున్నప్పటికీ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆంజనేయులు నిలదీశారు. గురువారం ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం పుస్తకాలను అంగడి సరుకుల్లా అమ్ముతున్నారని ఎంఈఓ 2 వెంకటరమేష్‌కు ఫిర్యాదు చేశారు. స్కూళ్లలో పాఠ్యపుస్తకాలను అమ్ముతున్నారని తెలియడంతో విద్యార్థి యువజన సంఘాల నాయకులు అమ్ముతున్న స్కూల్ రూములను గమనించి విద్యాశాఖ అధికారి చేత సీజ్ చేయించారు. ఎంఈఓ 2 మాట్లాడుతూ ప్రైవేటు స్కూళ్లు ఎక్కడైనా పాఠ్యపుస్తకాలు, స్కూల్ పేర్లను బిల్డింగ్ ఫొటోలను వేసి అత్యధిక రేట్లకు అమ్మితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్ఎస్‌యూఐ తాలూకా అధ్యక్షులు అనిల్‌కుమార్, కుమార్, కొట్రేష్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న 'శారదా విద్యావిహార్'


కరస్పాండెంట్ రవికుమార్

కళ్యాణదుర్గం, జూన్ 20: పట్టణంలోని శ్రీ శారద విద్యావిహార్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని, దాంతో పాటు పోటీ పరీక్షల్లో అత్యధికంగా ఉత్తీర్ణత సాధించారని కరెస్పాండెంట్ రవి కుమార్ అన్నారు. ఇక్కడ చదివిన ఎంతో మంది విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభను చాటారన్నారు. నర్సరీ నుంచి 7వ తరగతి వరకు 14 మంది ఉపాధ్యాయులతో పిల్లలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఇప్పటికీ పాఠశాలకు ఆదరాభిమానాలు వస్తూ మండలంలో మంచి గుర్తింపు సాధించామని తెలిపారు.

రోగుల పట్ల వైద్యుల నిర్లక్ష్యం
● ఏబీఎన్‌లో వార్త.. స్పందించిన అధికారులు


విచారిస్తున్న డీసీహెచ్ఎస్ , డీఎంహెచ్‌వో

ఉరవకొండ, జూన్ 20: పట్టణంలోని ప్రభుత్వ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిలో రోగుల పట్ల వైద్యులు దురుసుగా ప్రవర్తించారు. వైద్యం కోసం వెళ్లిన రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీనిపై ఏబీఎన్‌లో వైద్యుల తీరుపై స్క్రోలింగ్ రావడంతో జిల్లా కలెక్టర్ స్పందించారు. సంఘటనపైన విచారణ చేపట్టాలని వైద్యాధికారులకు ఆదేశించారు. పట్టణానికి చెందిన ఓ యువతి జ్వరంతో బాధపడుతోంది. వైద్యం చేయించుకునేందుకు ఆసుపత్రికి వెళ్లగా విధుల్లో ఉన్న డాక్టర్లు నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతోపాటు వైద్యం చేసేందుకు నిరాకరించారు. ఎవరితో చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ జ్వరపీడితరాలు బంధువులతో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న జిల్లా డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్, డీఎంహెచ్‌వో భ్రమరాంబదేవి ఆసుపత్రికి చేరుకుని విచారణ చేపట్టారు. సంఘటన వివరాలను సూపరింటెండెంట్ ఎల్లోజీతో అడిగి తెలుసుకున్నారు. బాధితులను వివరాలు అడిగారు. వైద్యులు సిబ్బందిపైన డీసీహెచ్ఎస్, డీఎంహెచ్‌వో ఆగ్రహం వ్యక్తం చేశారు. తీరు మార్చు కోవాలని, ఆసుపత్రికి వచ్చే వారితో అలాగేనా వ్యవహరించేదంటూ మండిపడ్డారు. అనంతరం వారు మాట్లాడుతూ సంఘటనకు సంబంధించి వివరాలను అడిగి తెలుసున్నామని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారికి షోకాజ్ నోటీసులు అందజేస్తున్నామన్నారు. విచారణ నివేదికను కలెక్టర్, జేసీకి అందజేస్తామని తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


బొమ్మనహాళ్: లింగదహాళ్‌లో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, వైద్య సిబ్బంది

రాయదుర్గం రూరల్, జూన్ 20: గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులపై పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ అల్లాబకాష్ సూచించారు. గురువారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని గ్రామీణ ప్రాంతంలో ఎప్పటికప్పుడు బ్లీచింగ్ చల్లుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, బసవరాజు, అశోక్‌కుమార్, శ్రీదేవి, ఎల్లక్క పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీధరఘట్ట వైద్యాధికారి గీతాభార్గవి సూచించారు. మండలంలోని లింగదహాళ్ గ్రామంలో సీజనల్ వ్యాధులపై వైద్యసిబ్బంది విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు లత, నాగరాజు, అనిల్‌కుమార్, సూపర్‌వైజర్ ఉమాదేవి, హెల్త్ అసిస్టెంట్‌లు వెంకటరమణ, ఎర్రమ్మ పాల్గొన్నారు.

కుందుర్పి: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ వైద్యాధికారులు, పంచాయతీ కార్యదర్శి, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ రోజూ పరిశుభ్రపరచి దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు.
వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

యాడికి: దోమలవ్యాప్తికి అడ్డుకట్ట వేస్తేనే మలేరియాను నిర్మూలించవచ్చని మలేరియా నివారణ తాడిపత్రి సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలోని కేజీబీవీలో మలేరియా నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

గుత్తి: మలేరియా వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ ఎల్లప్ప, డాక్టర్ ఎల్లారాముడు కోరారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మలేరియా నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. వైద్య సిబ్బంది అమృతలత, నాగమణి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం అభివృద్ధికి సహకరించండి: ఎమ్మెల్యే


మంత్రి సవితను కలిసిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, జూన్ 20: నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కోరారు. గురువారం వీరిని మర్యాదపూర్వకంగా కలసి కళ్యాణదుర్గం నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. నియోజకవర్గంలోని 114 చెరువులకు నీరందించాలని కోరారు. మంత్రి నిమ్మల రామానాయుడు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

రైతాంగాన్ని ఆర్థికంగా ఆదుకోండి


కరువు బృందానికి వినతిపత్రం ఇస్తున్న యశ్వంత్

కళ్యాణదుర్గం, జూన్ 20: కష్టాల్లో వున్న రైతాంగాన్ని ఆర్థికంగా తోడ్పాటు అందించాలని కరువు బృందానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తనయుడు అమిలినేని యశ్వంత్ వినతిపత్రాన్ని అందించారు. గురువారం కణేకల్లు మండలం సొల్లాపురం గ్రామంలో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన సీఈవో రితేష్ చౌహాన్, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఆర్డీవో రాణి సుష్మిత, ఇతర అధికారుల బృందం పంట నష్ట వివరాల గురించి తెలుసుకునేందుకు పర్యటించారు. కరువు బృందం వద్దకు యశ్వంత్ వెళ్లి కళ్యాణదుర్గం నియోజకవర్గంలో రైతన్నలు పడుతున్న కష్టాలపై క్షుణ్ణంగా వివరించారు. వ్యవసాయం మీదే ఆధారపడ్డ రైతాంగాన్ని ఆదుకునే దిశగా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఇందుకు స్పందించిన కరువు బృందం సమస్యలను పరిష్కరిస్తామని సానుకూలంగా స్పందించారు.

నగదు, బంగారం చోరీ

కళ్యాణదుర్గం, జూన్ 20: మరో వారం రోజుల్లో కుమారుడి పెళ్లి. పెళ్లి కోసం దాచి వుంచిన నగదు, బంగారం చోరీ కావడంతో బాధితులు లబోదిబోమన్నారు. గ్రామస్థులు, బాధితులు తెలిపిన మేరకు మండల పరిధిలోని నారాయణపురం గ్రామానికి చెందిన చాకలి ఆదినారాయణ, గోవిందమ్మల కుమారుడి పెళ్లి వారం రోజుల్లో జరగనుంది. పెళ్లి ఖర్చులకు రూ.2.65 లక్షలు సమకూర్చుకుని, మూడు తులాల బంగారం చేయించి ఇంట్లోని బీరువాలో దాచుకున్నాడు. కుటుంబ యజమాని బుధవారం రాత్రి ఇంటిపైన నిద్రిస్తున్నారు. పక్కా సమాచారం తెలుసుకున్న దొంగలు ఇంటి తలుపులు పగులగొట్టి బీరువా తాళాలు ధ్వంసం చేసి అందులో వున్న బంగారం నగదు ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయమే ఇంట్లోకి వచ్చిన ఆదినారాయణ చెల్లాచెదరుగా పడి వున్న బట్టలు, బీరువా చూసి అవాక్కయ్యాడు. కుమారుడి పెళ్లి కోసం దాచిన నగదు, బంగారం ఎత్తుకెళ్లారని లబోదిబోమన్నాడు. సంఘటనపై కళ్యాణదుర్గం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ నాయకుడిపై ఎస్సీ, ఎస్టీ కేసు

యాడికి, జూన్ 20: నిట్టూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రాజేశ్వర్‌రెడ్డిపై గురువారం ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గ్రామంలో రాజేశ్వర్‌రెడ్డికి, చిన్న ఆంజనేయులుకు పొలం తగాదా ఉందని తెలిపారు. గురువారం ఉదయం రాజేశ్వర్‌రెడ్డి పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నుతుండగా మా పొలంలో ఎందుకు పనులు చేస్తున్నావ్ అని చిన్న ఆంజనేయులు అతని తల్లి సుజాతమ్మ ప్రశ్నించారని తెలిపారు. వారిని రాజేశ్వర్‌రెడ్డి కులంపేరుతో దూషించి దాడిచేసినట్లు తెలిపారు. చిన్న ఆంజనేయులు ఫిర్యాదు మేరకు రాజేశ్వర్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామన్నారు.

11మంది రిమాండ్‌కు తరలింపు

పుట్లూరు, జూన్ 20: మండలంలోని కోమటికుంట్ల గ్రామంలో రెండురోజుల క్రితం టీడీపీ, వైసీపీ వర్గాలు ఘర్షణపడిన కేసులో గురువారం 11మందిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. టీడీపీ వర్గానికి సంబంధించి నారాయణస్వామి, రామచంద్రనాయుడు, పి. శ్రీనివాసులునాయుడు, సి. శ్రీనివాసులునాయుడు, సుధాకర్‌నాయుడు, చంద్రమోహన్‌నాయుడు, వైసీపీకి చెందిన మనోహర్, రాజశేఖర్, శివ, రమేష్‌కుమార్, విశ్వనాథ్‌లను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

ఎలుగుబంటి సంచారం

రాయదుర్గం రూరల్, జూన్ 20: పట్టణ సమీపంలో మొలకాల్మూరు రోడ్డు అభయ ఆంజనేయస్వామి గుడి సమీపంలో ఎలుగుబంటి సంచరించడంతో కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. గురువారం సాయంత్రం ఎలుగుబంటి ఆలయ సమీపంలో సంచరించడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫారెస్ట్ అధికారులు స్పందించి ఎలుగుబంటిని తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రహదారి సౌకర్యం కల్పించండి

గుంతకల్లు టౌన్, జూన్ 20: పట్టణంలోని మస్తాన్‌పేట సమీపంలో రెడ్ ట్యాంక్ వద్ద రైల్వే ప్రహరీ మధ్యలో మూసివేసిన దారిని వెంటనే తెరిపించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం నిరసన తెలిపారు. నాయకులు శ్రీనివాసులు, మారుతీప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజాసేవలో రెవెన్యూ శాఖ కీలకం

ప్రజాసేవలో రెవెన్యూ శాఖ కీలకమని పలువురు వక్తలు అన్నారు. గురువారం రెవెన్యూ దినోత్సవం సందర్భంగా గుంతకల్లు, కళ్యాణదుర్గం డివిజన్లలోని తహసీల్దార్ కార్యాలయాల్లో సమావేశాలు నిర్వహించారు. రెవెన్యూ శాఖ విశిష్టతలు పలువురు వివరించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలందించడం మా అదృష్టమన్నారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన తహసీల్దార్లు, ఉద్యోగులను సన్మానించారు.

\- న్యూస్ నెట్‌వర్క్


గుంతకల్లులో విశ్రాంత ఉద్యోగులకు సన్మానం


బొమ్మనహాళ్‌లో మాట్లాడుతున్న తహసీల్దార్ రామాంజినమ్మ


పుట్లూరులో సర్టిఫికెట్ అందజేస్తున్న తహసీల్దార్


పామిడిలో రెవెన్యూ సిబ్బంది


కుందుర్పిలో విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న డీటీ తిప్పేస్వామి, సిబ్బంది


రాయదుర్గంలో మాట్లాడుతున్న తహసీల్దార్ చిట్టిబాబు